PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి..

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 11-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 312 Issue: 312

Circulated to Telangana
Published from Jagitial

11 మే 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:49 సూర్యాస్తమయం - సా. 6:35 తిథి నవమి మ. 3:18 వరకు తరువాత దశమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం శతభిష రా. 1:16o వరకు తరువాత పూర్వాభాద్ర యోగం ఇంద్ర రా. 12:52o వరకు కరణం గరజి మ. 3:18 వరకు వనిజ తె. 3:13o వరకు వర్జ్యం ఉ. 8:13 నుండి ఉ. 9:52 వరకు దుర్ముహూర్తం మ. 12:38 నుండి మ. 1:29 వరకు మ. 3:11 నుండి సా. 4:02 వరకు రాహుకాలం ఉ. 7:25 నుండి ఉ. 9:01 వరకు యమగండం ఉ. 10:36 నుండి మ. 12:12 వరకు గుళికాకాలం మ. 1:48 నుండి మ. 3:24 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:13 నుండి తె. 5:01 వరకు అమృత ఘడియలు సా. 6:04 నుండి రా. 7:42 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:38 వరకు గమనిక: “o” అనగా మరుసటి రోజున



# మోదీ పొదుపు మంత్ర

ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సవాళ్లను అధిగమించేందుకు ప్రతి పౌరుడు సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా తలెత్తిన ప్రపంచ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి దేశ ప్రజలు కొన్ని త్యాగాలు చేయాలని కోరారు. ఇంధనాన్ని పొదుపు చేయడం, ప్రజా రవాణాను ఉపయోగించడం, వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని తిరిగి ప్రారంభించడం, అనవసర వస్తువుల కొనుగోళ్లు, విదేశీ పర్యటనలు మానుకోవడం ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఏడాది పాటు బంగారం కొనుగోళ్ల జోలికి వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు.

## బంగారం కొనడం ఆపేయండి

**పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గించండి.. ప్రజా రవాణాను వినియోగించండి**

**వర్క్‌ఫ్రం హోం విధానం మళ్లీ తెండి.. విదేశీ యాత్రలు వాయిదా వేయండి**

**సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు**



సికింద్రాబాద్, మే 10 (ఈవార్తలు): అంతర్జాతీయ ఘర్షణల వల్ల ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసులో తీవ్ర అంతరాయాలు ఏర్పడ్డాయని, ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సవాళ్లను భారత్ సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రజలందరి సమష్టి భాగస్వామ్యం అవసరమని నొక్కి చెప్పారు. కష్ట సమయాల్లో దేశం కోసం బాధ్యతాయుతంగా జీవించడం, మన కర్తవ్యాలను నెరవేర్చడం కూడా దేశభక్తేనని ఆయన అన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేయడమే కాదు, దేశం కోసం జీవించడం కూడా ముఖ్యమేనని పేర్కొన్నారు. “ప్రస్తుత పరిస్థితుల్లో విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడంపై మనం ప్రత్యేక దృష్టి పెట్టాలి. మనమందరం కలిసికట్టుగా ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవాలి” అని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయని, వాటి తరువాయి 2 వ పేజీలో...

# అంతా నేనే

## నేను తప్ప మరో అధికార కేంద్రం ఉండదు



### ప్రజాసేవలో ఎప్పటికీ తప్పు చేయను

**ప్రజల సొమ్ము పైసా తీసుకోను.. ఫస్ట్ స్పీచ్‌తో అదరగొట్టిన సీఎం విజయ్**

**200 ఉచిత విద్యుత్ ఫైల్‌పై తొలిసంతకం.. మొత్తం 9 మంది మంత్రులుగా ప్రమాణం**

పేదరికం, ఆకలి అంటే ఏంటో నాకు తెలుసు. నేనేం రాయల్ ఫ్యామిలీలో పుట్టలేదు. నేను మీలో ఒకణ్ని. నేను సినిమాల్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసే వ్యక్తికి జన్మించాను. నేను మీ తమ్ముణ్ని. మీ కృతజ్ఞతకు రుణపడి ఉంటాను. నేను దేవుణ్ని కాదు.. ఓ సామాన్యుణ్ని. అసాధ్యమైన వాటిని హామీలు ఇవ్వను. కానీ మిమ్మల్ని చూస్తుంటే ఏమైనా చేయగలం అనిపిస్తోంది. ఎవరినైనా కలవడానికి నా ముఖాన్ని దాచుకోను, నేను పాదర్శకంగా ఉంటాను. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేసి.. దాని ఆధారంగా ముందుకు తీసుకెళ్లాలని అనుకుంటున్నాను. ఇట్స్ ఏ న్యూ బిగినింగ్, ఏ న్యూ ఎరా ఆఫ్ ఏ రియల్ సెక్యులర్ సోషల్ జస్టిస్ స్టార్ట్స్ నౌ. మీరు నా స్నేహితులు కావచ్చు లేదా శత్రువులు కావచ్చు. 8 కోట్ల మంది తమిళనాడు ప్రజలంతా నా వాళ్లే. - తమిళనాడు సీఎం విజయ్

# యథావిధిగా ఇంటర్ అడ్మిషన్లు



**పాఠశాల విద్యలో విలీనంపై సీఎం రేవంత్ సమీక్ష**

**భాగస్వాములతో విస్తృత సంప్రదింపులు**

**శాసనసభలో చర్చ తర్వాతే నిర్ణయం**

హైదరాబాద్, మే 10 (ఈవార్తలు): ఈ ఏడాది యథావిధిగా ఇంటర్మీడియట్ ప్రవేశాలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండడం, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండడంతో విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్‌ను రద్దు చేసి సీబీఎస్ఈలో తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,093 |
| వెండి (కిలో): | రూ.2,70,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,055 |

## విశ్వవాణి



ఫ్లోరిడాలో దాదాపు 200 కుటుంబాలను ఖాళీ చేయించాలనుకున్నందుకు ఆయా కుటుంబాల తరపున ఏకంగా 1,70,000 డాలర్లను అద్దెగా చెల్లించి పెద్ద మనసు చాటుకున్నాడు ర్యాపర్ కొడాక్ బ్లాక్. అయినా, ఎక్కడా ప్రచారం చేసుకోకుండా తన పని తాను చేసుకుపోయాడు. గత ఏడాది ఏప్రిల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది.

# 5 గంటలు ఫిర్యాదు తీసుకోలే!



**కంటెంట్ మార్చాలని ఒత్తిడి తెచ్చారు**

**పెద్దపెద్ద వాళ్లు ఉన్నారని బెదిరించారు**

**మోదీ సభలో ఆత్మహత్య చేసుకుంటాననంటేనే ఎఫ్ఐఆర్ కాపీ**

**బండి భగీరథ్ పోక్సో కేసుపై ఆర్ఎస్పీ వెల్లడి**

హైదరాబాద్, మే 10 (ఈవార్తలు): కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై పోక్సో కేసుకు సంబంధించి బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కీలక విషయాలు వెల్లడించారు. తనను లైంగిక వేధింపులకు గురిచేశాడని స్వయంగా మైనర్ బాలిక వచ్చి పోలీసుల ముందు చెప్పిందని తెలిపారు. బాధితురాలు న్యాయం కోసం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఇంతకీ ఆమె ఏం పాపం చేసింది, ఆమె కుటుంబం చేసిన పాపమేంటని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. బాధితురాలి తల్లితో ఇవాళ మధ్యాహ్నం 12 గంటలకు మాట్లాడానని తెలిపారు. బిడ్డకు న్యాయం జరగాలని ఆ తల్లి పడ్డ వేదన బాధ కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశంలో న్యాయం ఇంత ఘోరంగా ఉంటుందా అని వ్యాఖ్యానించారు. చట్టం ఉన్నవాళ్లకు చుట్టంలా ఉంటదా అని అనిపిస్తోందని మండిపడ్డారు. ఆ తల్లితో తరువాయి 2 వ పేజీలో...

# అదంతా కుట్ర



**నన్ను ఏదో చేయాలని చూస్తున్నారు**

**మోదీ సభలో బండి సంజయ్ కంటతడి**

ప్రధాని మోదీ సభలో భావోద్వేగంతో మాట్లాడిన కేంద్రమంత్రి బండి సంజయ్ .. కంటతడి పెట్టారు. తనను రాజకీయంగా ఎదుర్కోవడం చేతకాక.. తనపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తనను ఏదో చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై దుష్ప్రచారం చేస్తున్నారన్న బండి సంజయ్.. వేదికపైనే కంటతడి పెట్టడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇక జై శ్రీరాం నినాదంతో పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చిందని స్పష్టం చేసిన బండి సంజయ్.. అదే నినాదంతో తెలంగాణలోనూ కాషాయ జెండాను ఎగురవేస్తామని స్పష్టం చేశారు.

సికింద్రాబాద్, మే 10 (ఈవార్తలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన సందర్భంగా.. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాట్లాడిన బండి సంజయ్.. తనపై వస్తున్న విమర్శలు, ఆరోపణలపై క్లారిటీ ఇచ్చారు. తనపై కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని కంటతడి పెట్టుకున్నారు. సనాతన ధర్మం కోసం తాము పనిచేస్తున్నామని చెప్పిన బండి సంజయ్.. ధర్మాన్ని కించపరిస్తే ఊరుకునేదిలేదని తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇక జై శ్రీరామ్ అంటే కడుపు నిండుతుందా అని కొందరు హేళన చేసేలా వ్యాఖ్యలు చేస్తున్నారని పరోక్షంగా ఇటీవల మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేసిన బండి సంజయ్.. జై శ్రీరాం నినాదమే తమలో పోరాటపటిమను నింపిందని స్పష్టం చేశారు. జై శ్రీరామ్ అంటేనే కాంగ్రెస్ నాయకులు భయపడుతున్నారన్న బండి సంజయ్.. బీజేపీకి తలవంపులు తీసుకువచ్చే పనులు తరువాయి 2 వ పేజీలో...




# మరోసారి సబ్బుల రేట్లు పెంపు?

**బిస్కెట్లు, ప్యాకేజ్డ్ ఫుడ్స్ ధరలూ**

న్యూఢిల్లీ: నిత్యావసర వస్తువుల ధరలు మరోసారి పెరగనున్నాయి. సబ్బులు, డిటర్జెంట్లు, బిస్కెట్లు, ప్యాకేజ్డ్ ఫుడ్స్, పానీయాలు వంటి రోజువారీ వినియోగ వస్తువులు త్వరలో మరింత ఖరీదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెరుగుతున్న ముడిచమురు ధరలు, ప్యాకేజింగ్ ఖర్చులు, లాజిస్టిక్స్ వ్యయాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఎఫ్ఎంసీజీ కంపెనీలు ధరల పెంపు నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని సంస్థలు 3–5 శాతం వరకు ధరలను పెంచగా, అవసరమైతే మరింత పెంపు చేపడతామని తరువాయి 2 వ పేజీలో...

# కేసీకే రాహుల్ ఓటు!?

## కేరళం సీఎంగా వేణుగోపాల్‌వైపే మొగ్గు



తిరువనంతపురం: కేరళంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి ఇటీవల జరిగిన ఎన్నికల్లో భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే ఫలితాలు వెలువడి దాదాపు వారం రోజులు గడుస్తోన్నా ఇంకా ముఖ్యమంత్రి ఎవరనే విషయం తేలలేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేరళం ముఖ్యమంత్రి అభ్యర్థిగా కేసీ వేణుగోపాల్ వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే నివాసంలో జరిగిన అధికారిక భేటీకి ముందే రాహుల్ గాంధీ కేసీ వేణుగోపాల్‌తో విడిగా సమావేశమైనట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి పదవి అంశమై ఇరు నేతలు సుదీర్ఘంగా చర్చలు జరపునున్నట్లు సమాచారం. కాగా కేరళం ముఖ్యమంత్రి విషయంలో కాంగ్రెస్ నేతల మధ్య తీవ్రమైన పోటీ తరువాయి 2 వ పేజీలో...



# డబుల్ స్ట్రోక్ ఇస్తాం

**దాడులకు తెగబడితే రెట్టింపు ప్రతి దాడులు**

**సైన్యానికి ఇరాన్ సుప్రీం మొజ్తాబా ఆదేశాలు**

టెహ్రాన్: ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. శత్రుదేశాలు దాడులకు తెగబడితే రెట్టింపు ప్రతి దాడులు చేయాలని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

11.5.2026

**మేషం:** కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది. చేపట్టిన వ్యవహారాలలో అవాంతరాలు తప్పవు. నూతన ఋణయత్నాలు చేస్తారు. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. గృహ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి.

**వృషభం:** ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహపరుస్తాయి. మిత్రులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ప్రయాణాలలో జాగ్రత్తగా వ్యవహరించాలి. ముఖ్యమైన పనులలో శ్రమపడ్డా పనులు ముందుకు సాగవు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగాలలో మీ విలువ మరింత పెరుగుతుంది.

**మిథునం:** ఆత్మీయుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. ఇంటా బయట మంచి మాట తీరుతో ఆకట్టుకుంటారు. నూతనోత్సాహంతో పనులు పూర్తి చేస్తారు. వ్యాపార ఉద్యోగాలలో మీ శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది.

**కర్కాటకం:** ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. నూతన వాహన సౌఖ్యం కలుగుతుంది. కొన్ని వ్యవహారాలలో ఆకస్మికంగా నిర్ణయాలు మార్చుకుంటారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆర్థికంగా అనుకూల వాతావరణం ఉంటుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో మీ అంచనాలు నిజం కాగలవు.

**సింహం:** ఖర్చుల విషయంలో పునరాలోచన చేయటం మంచిది. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. గృహ వాతావరణం చికాగ్గా ఉంటుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఇంటా బయట పరిస్థితులు అనుకూలించవు. చేపట్టిన వ్యవహారాలలో ప్రతిబంధకాలు ఉంటాయి. వృత్తి, ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి.

**కన్య:** ఆర్థిక వాతావరణం గందరగోళంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో కష్టపడ్డా ఫలితం ఉండదు. గృహమున కొందరి ప్రవర్తన వలన మానసిక సమస్యలు కలుగుతాయి. బంధు వర్గం వారితో వివాదాలు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

**తుల:** ఆర్థిక ఇబ్బందులు అధిగమిస్తారు. ఒక వ్యవహారంలో అందరిని ఒక మాట మీదకు తీసుకువస్తారు. నూతన వాహన యోగం ఉన్నది. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలు కొంత సామాన్యంగా సాగుతాయి. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

**వృశ్చికం:** చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు తప్పవు. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారించడం మంచిది. వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది.

**ధనస్సు:** నిరుద్యోగ శ్రమ ఫలించి నూతన అవకాశాలు లభిస్తాయి. స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. సంతానం విద్యా విషయాలలో శుభవార్తలు అందుకుంటారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

**మకరం:** ధన పరంగా ఒడిదుడుకులు అధికమవుతాయి. ఊహించని ప్రయాణాలు చేయవలసి వస్తాయి. కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడులు అధికమవుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వాయిదా పడతాయి. వృత్తి ఉద్యోగాల్లో అదనపు పనిభారం ఉంటుంది.

**కుంభం:** సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. వ్యాపారస్తులకు నూతన పెట్టుబడులు అందుతాయి. సమయానికి పనులు పూర్తి చేయగలుగుతారు. ఉద్యోగాలలో అధికారుల సహాయ సహకారాలతో నూతన అవకాశాలు అందుకుంటారు.

**మీనం:** భూ సంబంధిత క్రయవిక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వ్యాపారాలలో భాగస్వామితో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో గతం కంటే మెరుగైన వాతావరణం ఉంటుంది.

# మోదీ పొదుపు మంత్ర

మొదటి పేజీ తరువాయి

కొనుగోలుకు వెచ్చిస్తున్న విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడం మనందరి బాధ్యత అని ప్రధాని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న చోట మెట్రో రైలు, ఇతర ప్రజా రవాణా సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రైవేట్ వాహనాలు అవసరమైనప్పుడు కార్‌పూలింగ్ విధానాన్ని ఎంచుకోవాలని కోరారు. సరుకు రవాణాకు రైల్వేలను ఎక్కువగా ఉపయోగించాలని, వీలైనంత వరకు ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని పెంచాలని సూచించారు.

### కొవిడ్ నాటి పద్ధతులు పునరుద్ధరించాలి

దేశ ప్రయోజనాల దృష్ట్యా కరోనా మహమ్మారి సమయంలో పాటించిన కొన్ని పద్ధతులను తిరిగి ప్రారంభించాలని ప్రధాని కోరారు. వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌ల వంటి విధానాలకు మళ్లీ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. "కరోనా సమయంలో మనం ఈ పద్ధతులకు అలవాటు పడ్డాం. ఇప్పుడు వాటిని పునరుద్ధరించడం దేశానికి ఎంతో అవసరం" అని ఆయన అన్నారు. విదేశీ మారక ద్రవ్య నిల్వలను కాపాడేందుకు ప్రజలు అనవసరమైన విదేశీ ప్రయాణాలు, విదేశాల్లో విహారయాత్రలు, పెళ్లిళ్లు వంటివి మానుకోవాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని, వేడుకలను భారతదేశంలోనే జరుపుకోవాలని కోరారు. అలాగే, కనీసం ఒక సంవత్సరం పాటు అనవసరమైన బంగారం కొనుగోళ్లను నివారించాలని సలహా ఇచ్చారు. "మేడ్-ఇన్-ఇండియా" ఉత్పత్తులకే ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా బూట్లు, బ్యాగులు వంటి రోజువారీ వస్తువులను స్థానికంగా తయారైనవే కొనాలని సూచించారు.

### రైతులకు, కుటుంబాలకు సూచనలు

ప్రతి కుటుంబం వంట నూనె వినియోగాన్ని తగ్గించుకోవాలని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు వ్యక్తిగత ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని ప్రధాని హితవు పలికారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని 50 శాతం తగ్గించాలని, సహజ వ్యవసాయ పద్ధతుల వైపు మళ్లాలని కోరారు. దీనివల్ల భూసారం పెరగడంతో పాటు దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని వివరించారు. డీజిల్ పంపులకు బదులుగా సౌరశక్తితో నడిచే పంపుసెట్లను ఎక్కువగా వినియోగించుకోవాలని ఆయన రైతులను ప్రోత్సహించారు. ప్రపంచవ్యాప్తంగా ఎరువుల బస్తా ధర సుమారు రూ. 3,000 ఉండగా, భారత ప్రభుత్వం రైతులకు కేవలం రూ. 300 లోపే అందిస్తోందని గుర్తుచేశారు. ప్రభుత్వం ప్రజలపై భారం పడకుండా తనపై వేసుకుంటోందని, అయితే సంక్షోభం తీవ్రంగా ఉన్నందున ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని అన్నారు. "భారతమాతను ప్రథమ స్థానంలో నిలిపి, మనమందరం ఐక్యంగా పోరాడాలి" అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

మాతో కలవండి.. రేవంత్‌కు మోదీ విజ్ఞప్తి

అంతకుముందు, హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో వర్చువల్‌గా రాష్ట్రవ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి నిర్వహించిన సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. రూ.9,400 కోట్ల అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. జహీరాబాద్ పారిశ్రామిక కారిడార్‌ను గ్లోబల్ హబ్‌గా.. వరంగల్ మిత్ర పార్కును వస్త్ర విప్లవానికి కేంద్రంగా నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఈ క్రమంలోనే అంతకుముందు ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి.. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి గుజరాత్ రాష్ట్రానికి ఏమేం నిధులు, ప్రాజెక్టులు కేటాయించారో.. అదే విధంగా తెలంగాణకు కూడా ఇవ్వాలని చేసిన విజ్ఞప్తిపై స్పందించిన ప్రధాని మోదీ.. అలా చేస్తే.. ఇప్పుడు తెలంగాణకు వచ్చే వాటిలో సగమే వస్తాయని పేర్కొన్నారు. ఒకవేళ అలాగే కావాలంటే.. తెలంగాణ అనుకున్న స్థాయికి అభివృద్ధి చెందలేదని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వంతో కలిసి నడిస్తేనే తెలంగాణ లక్ష్యాలు నెరవేరుతాయని పేర్కొన్న ప్రధాని మోదీ.. తమతో కలవాలని, కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. దీంతో ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి సహా కేంద్రమంత్రి బండి సంజయ్ నవ్వారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడమే మంచిదని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి ప్రధాని మోదీ సూచించారు. గత 10 ఏళ్లలో గుజరాత్‌కు కేంద్ర ప్రభుత్వం ఏం ఇచ్చిందో.. అవన్నీ తెలంగాణకు ఇచ్చేందుకు తాను రెడీ అని ప్రకటించారు. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే సంకల్పంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపిన రేవంత్ రెడ్డి.. అందుకోసం తెలంగాణ మోడల్‌ను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు నరేంద్ర మోదీ గుజరాత్ మోడల్‌ను ఎలా అభివృద్ధి చేశారో.. ఇప్పుడు తెలంగాణపై కూడా అవే అంచనాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి పేర్కొనడంతో.. దానికి సమాధానంగా ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా వరంగల్‌లో ఏర్పాటు కానున్న పీఎం మిత్ర పార్క్.. దేశంలో సరికొత్త వస్త్ర విప్లవాన్ని తీసుకువస్తుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత వస్త్ర పరిశ్రమ కీలక పాత్ర పోషించిందని.. తిరిగి ఆ వైభవాన్ని తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే బడ్జెట్ రూ. 1,000 కోట్ల లోపే ఉండేదని.. కానీ ఇప్పుడు ఒక్క తెలంగాణకే సుమారు రూ.5,500 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ. 50 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు జరుగుతున్నాయని వివరించారు. గత 11 ఏళ్లలో తెలంగాణలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ రెట్టింపు అయినట్లు గుర్తు చేశారు. సోలార్ పవర్ ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతోందని పేర్కొన్న ప్రధాని మోదీ.. ఇంధన భద్రత కోసం భారీగా పెట్టుబడులు పెడుతున్నామని తెలిపారు.

# నేను తప్ప మరో అధికార కేంద్రం ఉండదు

**ప్రజాసేవలో ఎప్పటికీ తప్పు చేయను**

**ప్రజల సొమ్ము పైసా తీసుకోను..**

**ఫస్ట్ స్పీచ్‌తో అదరగొట్టిన సీఎం విజయ్**

**200 ఉచిత విద్యుత్ ఫైల్‌పై తొలిసంతకం**

**మొత్తం 9 మంది మంత్రులుగా ప్రమాణం**

తమిళనాడులో గత కొన్నిరోజులుగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడుతూ.. ఎట్టకేలకు కొత్త ప్రభుత్వం ఏర్పడింది. కలిసి వచ్చే పార్టీలతో కలిసి తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ నేతృత్వంలో ప్రభుత్వం కొలువుదీరింది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రిగా చంద్రశేఖర్ జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకారం చేశారు. చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో జరిగిన ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఇక తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్.. ముఖ్యమంత్రిగా విజయ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తర్వాత మరో 9 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తన తొలి ప్రసంగంలోనే విజయ్.. తనను తాను ఒక సామాన్యుడిగా పరిచయం చేసుకున్నారు. తాను ఏ రాజవంశానికి చెందినవాడిని కానని.. అందుకే తమిళ ప్రజలు తనను అంగీకరించారని ఆయన తన మూలాలను ప్రస్తావిస్తూ అందరి దృష్టిని ఆకర్షించారు. ఒక సాధారణ సినిమా డైరెక్టర్ కుమారుడు నేడు.. మీ అందరి ఆశీస్సులతో ముఖ్యమంత్రి అయ్యాడు అంటూ తన స్పీచ్‌ను విజయ్ ఎమోషనల్‌గా మొదలుపెట్టారు. ఇక తాను అబద్ధపు హామీలు, వాగ్దానాలతో ప్రజలను మోసం చేయనని విజయ్ తేల్చి చెప్పారు. నిజమైన, లౌకిక, సామాజిక న్యాయం ఉన్న శకం కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు. తన ప్రభుత్వ పనితీరును అంచనా వేయడానికి తనకు తగినంత సమయం ఇవ్వాలని కొత్త ముఖ్యమంత్రి విజయ్ తమిళ ప్రజలను కోరారు. ఇక తాను తప్ప మరో అధికార కేంద్రం ఉండదని.. తానే ఏకైక అధికార కేంద్రంగా ఉంటానని వెల్లడించారు. తన ప్రభుత్వ విధానాలకు తానే జవాబుదారీగా ఉంటానని.. ఎవరి జోక్యం, ప్రభావం ఉండదని ఆయన పరోక్షంగా సూచించారు. తాను ఈ స్థాయికి రావడానికి.. రాజకీయాల్లో ఎదుర్కొన్న సవాళ్లను, భవిష్యత్ కార్యాచరణను ఈ సందర్భంగా విజయ్ స్పష్టం చేశారు. ఇవాళ సీఎంగా నిలబడడానికి ఎన్నో కష్టాలు పడ్డానని.. తనను చాలా మంది చాలా రకాలుగా ఇబ్బంది పెట్టారని.. అడ్డుకోవాలని చూశారని.. కానీ వాటన్నింటినీ అధిగమించి ఈ స్థానంలో మీ ముందు నిలబడ్డానని.. తాను మీ అందరి వాడిని అంటూ విజయ్ ఉత్సాహభరితమైన ప్రసంగం ఇచ్చారు. ఇక ఈ విజయం వెనుక టీవీకే పార్టీ కార్యకర్తలు చేసిన అలుపెరుగని కృషి ఉందని.. వారికి తన జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. కొత్త ప్రభుత్వంలో కులమతాలకు తావులేదని.. తాము ఎలాంటి కక్షసాధింపు రాజకీయాలు చేయబోమని వెల్లడించారు. ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి.. వాటిని నిలబెట్టుకుంటామని.. రైతులు, మహిళలు, విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందని విజయ్ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆందోళన వద్దని.. విజయ్ మామ తోడుగా ఉంటాడని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తమిళనాడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసిన విజయ్.. గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల అప్పు ఉందని తెలిపారు. త్వరలోనే ప్రభుత్వ ఆర్థిక స్థితిపై శ్వేతపత్రం విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల సొమ్మును వృథా చేయనని.. ఎవరినీ దోచుకోనివ్వనని విజయ్ తేల్చి చెప్పారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి, తనకు అప్పగించిన బాధ్యత విషయంలో ఏమాత్రం వమ్ము చేయనని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు. తన ప్రభుత్వం మహిళల భద్రతపై ఫోకస్ పెడుతుందని.. డ్రగ్స్ విక్రయాలను అరికట్టడానికి, సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతుందని విజయ్ తెలిపారు. మీరు నాకు చాలా పెద్ద బాధ్యత అప్పగించారు. కానీ నాకు కొంత సమయం ఇవ్వాలని మిమ్మల్ని కోరుతున్నాను. నేను ఎప్పటికీ తప్పు చేయను అని విజయ్ తమిళనాడు ప్రజలకు స్పష్టం చేశారు. తన పార్టీకి మద్దతు ప్రకటించిన కాంగ్రెస్, కమ్యూనిస్టు, వీసీకే, ఐయూఎంఎల్ నేతలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపిన విజయ్.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని మై బ్రదర్ అని సంబోధించారు. రాహుల్ గాంధీ చేతిని పైకెత్తి విజయ్ అభివాదం చేశారు. తన విజయానికి కారణమైన టీవీకే కేడర్‌కు, సోషల్ వారియర్స్‌కు విజయ్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. మీరు లేకపోతే ఈ విజయం సాధ్యమయ్యేది కాదన్నారు. తన ప్రమాణ స్వీకార వేడుకకు హాజరైన వారందరితో సెల్ఫీ వీడియో తీసుకున్న విజయ్.. ఈ క్షణాలను గొప్ప జ్ఞాపకంగా తన ఫోన్లో దాచుకున్నారు.

### విజయ్‌ని అన్‌ఫాలో చేసిన కొడుకు

విజయ్ జీవితంలో చారిత్రాత్మక వేడుకలో ఆయన భార్య సంగీత సోర్నలింగం.. పిల్లలు జేసన్ సంజయ్, దివ్య సాష గైర్హాజరు కావడం ఇప్పుడు తమిళ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మరీ ముఖ్యంగా భార్య సంగీతతో విడాకుల వ్యవహారం నడుస్తున్న వేళ.. జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆ కుటుంబం హాజరుకాకపోవడం చర్చకు దారి తీసింది.

# యథావిధిగా ఇంటర్ అడ్మిషన్లు

మొదటి పేజీ తరువాయి

మాదిరే 11, 12 తరగతులు నిర్వహించాలని.. ఫలితంగా డ్రాపౌవుట్స్ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. సీబీఎస్ఈతో పాటు మెజారిటీ రాష్ట్రాలు 11, 12 తరగతుల విధానాన్ని అనుసరిస్తున్నాయి. మన రాష్ట్రంలో మాత్రం ఇంటర్మీడియట్ విద్య వేరుగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల్లో అత్యధికులు ఆ తర్వాత ఇంటర్మీడియట్‌కు వేరుగా ఉన్న కళాశాలల్లో చేరడం లేదు. అప్పటితో విద్యను నిలిపివేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌ను వేరుగా కాకుండా 11, 12 తరగతులుగా కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గతంలో అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సైతం తన నివేదికలో పేర్కొంది. ఇటీవల ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు నిలిపివేస్తూ అధికారులు ప్రకటన విడుదల చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, విద్యా శాఖ కమిషనర్ యోగితా రాణాలతో చర్చించారు. విలీనంతో ముడిపడిన పలు సాంకేతిక సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు. విలీన ప్రక్రియకు సంబంధించి భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై నియమించిన కమిటీ అధ్యయనం చేసి తన నివేదిక సమర్పించాలని సీఎం సూచించారు. అనంతరం శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# 5 గంటలు ఫిర్యాదు తీసుకోలే!

మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతుంటే.. ఆమె చెప్పిన విషయాలు బాధ కలిగించాయని వివరించారు. ' మే 8వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో ఆమె పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ కంప్లయింట్ అక్నాలెడ్జ్‌మెంట్ ఇవ్వడానికి ఐదు గంటల సమయం పట్టింది. కంప్లయింట్‌లో ఉన్న కంటెంట్ మార్చాలని పోలీసులు ఒత్తిడి పెట్టారు. ఇందులో పెద్దపెద్ద వాళ్లు ఉన్నారని బెదిరించారు. పెద్దపెద్ద వాళ్ల పేర్లు రాయొద్దని సూచించారు. చివరకు ఆ తల్లి నా బిడ్డ, నేను మోదీ సభలో ఆత్మహత్య చేసుకుంటామని భయపెడితే తప్ప కంప్లయింట్‌కు అక్నాలెడ్జ్‌మెంట్ ఇవ్వలేదు. అప్పటికి కూడా ఎఫ్ఐఆర్ డీటెయిల్స్ వారికి ఇవ్వలేదు. ఎఫ్ఐఆర్ కాపీ వచ్చిందో రాలేదో బాధితులకు తెలియదు. నేను ఆ తల్లితో మాట్లాడిన తర్వాతే ఎఫ్ఐఆర్ డీటెయిల్స్ తెలిశాయి.' అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఇది హోంమంత్రిగా ఉన్న రేవంత్ పాలనలో నాలుగు పాదాలపై నడుస్తున్న ధర్మమని మండిపడ్డారు. ' మోదీ గారూ.. మీరు ఈ దేశానికి ప్రధానమంత్రి.. బేటీ బచావో అనే నినాదం మీ నోటి నుంచే వచ్చింది. కానీ ఈ దేశంలో మహిళలపై అడుగడుగునా అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఆడబిడ్డ పుట్టకముందే చంపేస్తున్నారు. మీ కేబినెట్ మంత్రి బండి సంజయ్ కొడుకుపై పోక్సో కేసు నమోదైంది. బండి సంజయ్ కొడుకు మైనర్ బాలికను బలత్కారం చేశాడు. ఆ కేంద్రమంత్రి ఇప్పుడు మీ పక్కనే కూర్చున్నాడు. మీ వేదిక ముందు వేలాది మంది తెలంగాణ మహిళలు కూర్చున్నారు. ఇప్పటివరకు మీరు బండి సంజయ్‌ను ఎందుకు బర్తరఫ్ చేయలేదు.' అని ప్రశ్నించారు.

# అదంతా కుట్ర

మొదటి పేజీ తరువాయి

తాను చేయనని తేల్చి చెప్పారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేక.. తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. భయపడడానికి తాను ఫామ్‌హౌస్‌లోని ఎలుకను కాదని.. కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా సొంత పార్టీ నేతలకు కూడా బండి సంజయ్ చురకలు అంటించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవట్లేదని.. ఈ క్రమంలోనే బీజేపీ నేతలు భేదాభిప్రాయాలు వీడాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీకి అధికారమే లక్ష్యంగా పోరాడాలని.. ప్రధాని మోదీ లేనిదే రాష్ట్రంలో ప్రభుత్వం నడవదని తేల్చి చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీకి గెలుపు అంత సులభంగా రాలేదని తెలిపిన బండి సంజయ్.. 300 మంది బీజేపీ కార్యకర్తలు బలిదానం చేశారని పేర్కొన్నారు. కేరళలోనూ బీజేపీ శ్రేణులపై దాడులు జరిగాయని.. నిధులు ఇచ్చేది, అభివృద్ధి చేసేది బీజేపీనేనని స్పష్టం చేశారు.

# డబుల్ స్ట్రోక్ ఇస్తాం

మొదటి పేజీ తరువాయి

మొజ్తాబా ఖమేనీతో ఇరాన్ ఖతం అల్ అన్బియా సెంట్రల్ హెడ్‌క్వార్టర్స్ చీఫ్ కమాండర్ అలీ అబ్దుల్లాహి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో వారిరువురి మధ్య పశ్చిమాసియా యుద్ధం, కాల్పుల విరమణ, అమెరికా-ఇజ్రాయెల్ దాడుల అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా అమెరికా-ఇజ్రాయెల్ దాడులపై ప్రతి దాడులు చేయాలని, శత్రువులను దృఢంగా ఎదుర్కొనేలా కొత్త మార్గదర్శకాలు జారీ చేసినట్లు ప్రముఖ మీడియా సంస్థ ఫార్స్ న్యూస్ తెలిపింది. ఇరాన్ సాయుధ దళాలు అమెరికా-ఇజ్రాయెల్ ఏ చర్యనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాయని కమాండర్ అబ్దుల్లాహి పేర్కొన్నారు. శత్రువు ఏ తప్పు చేసినా ఇరాన్ ప్రతిస్పందన వేగంగా, తీవ్రంగా ఉంటుంది అని ఆయన హెచ్చరించినట్లు ఫార్స్ న్యూస్ హైలెట్ చేసింది. తాజా ప్రకటనతో గల్ఫ్ ప్రాంతంలో ఇప్పటికే ఉన్న ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఇరాన్ సైన్యం, ఐఆర్‌జీసీ తరచూ అమెరికా, దాని మిత్రదేశాలకు హెచ్చరికలు జారీ చేస్తూ వస్తున్నాయి. హర్మూజ్ జలసంధి వంటి కీలక చమురు మార్గాల భద్రతపై కూడా ఈ పరిణామాలు ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# కేసీకే రాహుల్ ఓటు!?

మొదటి పేజీ తరువాయి

నెలకొంది. వీడీ సతీశన్, రమేష్ చెన్నితల, కేసీ వేణుగోపాల్, శశిథరూర్‌లు సీఎం అభ్యర్థులుగా ప్రచారం జరిగింది. కాగా ఇటీవల వేణుగోపాల్‌కు వ్యతిరేకంగా కేరళలో పోస్టర్లు వెలిశాయి. దీని వెనుక సతీశన్ హస్తం ఉందనే ఆరోపణలు రావడంతో రాహుల్ గాంధీ ఆయనను నేరుగా ప్రశ్నించారు. వేణుగోపాల్ సీఎం కావడాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్లు సతీశన్ అంగీకరించారు. మట్నుదటి నుంచి వేణుగోపాల్ ఎంపికను మరో కీలక నేత వీడీ సతీశన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వేణుగోపాల్ తన పదవిని ఉపయోగించి గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని అధిష్టానం వద్ద సైతం ఫిర్యాదు చేశారు. కాగా సతీషన్, రమేష్ చెన్నితల వంటి స్థానిక నేతలకు కేరళలో మంచి పట్టు ఉంది. ముఖ్యంగా ముస్లిం లీగ్ మద్దతు సైతం సతీశన్‌కు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఇంత బలంగా సతీశన్ ఉన్నప్పటికీ కాంగ్రెస్ హైకమాండ్ కేసీ వేణుగోపాల్ వైపే మట్నుగ్గు చూపుతున్నట్లు సమాచారం. రాబోయే రెండు రోజుల్లో పార్టీ శ్రేణులను ఒప్పించి కేసీ వేణుగోపాల్‌ను ముఖ్యమంత్రిగా ప్రకటించే దిశగా హైకమాండ్ ప్రయత్నాలు సైతం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# మరోసారి సబ్బుల రేట్లు పెంపు?

మొదటి పేజీ తరువాయి

ఇటీవల స్పష్టం చేశాయి. ప్రపంచ సరఫరాలో నెలకొంటున్న అంతరాయాలు, రూపాయి బలహీనత కూడా కంపెనీలపై ఒత్తిడిని పెంచుతున్నాయి. డాబర్ ఇండియా, బ్రిటానియా ధరల సవరణ తప్పదని తెలిపాయి. ఇక ఫెవికల్ తయారీ సంస్థ పిడిలైట్ ఇండస్ట్రీస్, కూల్ డ్రింక్స్ కంపెనీలు కూడా ధరల పెంపు లేదా డిస్కౌంట్ల తగ్గించే దిశగా ఆలోచిస్తున్నాయి. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు కొనసాగితే, రాబోయే నెలల్లో రోజువారీ వినియోగ వస్తువుల ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు వెల్లడించారు. ధరలను పెంచడంతో పాటు, ఎఫ్ఎంసీజీ కంపెనీలు మరో వ్యూహాన్ని కూడా అనుసరిస్తున్నాయి. 'ష్రింక్‌ఫ్లేషన్', అంటే ధరను అలాగే ఉంచి, ప్యాక్ పరిమాణాన్ని తగ్గించడం. ముఖ్యంగా రూ.5, రూ.10, రూ.15 ధరల్లో అమ్ముడయ్యే చిన్న ప్యాకెట్లలో ఈ మార్పులు ఎక్కువగా చేసే అవకాశం ఉంది.

# 2 గంటల టైమివ్వండి

## ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి వినతి.. పలు అంశాలు వివరిస్తానని వెల్లడి



హైదరాబాద్, మే 10 (ఈవార్తలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన వేళ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చాలా ఆసక్తికరంగా మారాయి. హెచ్ఐసీసీలో పలు ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీతో కలిసి వేదికను పంచుకున్న సీఎం రేవంత్.. కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణపై పెద్ద మనసు చూపండి అంటూ ప్రధాని మోదీకి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశాభివృద్ధిలో భాగంగా తెలంగాణ అభివృద్ధికి కూడా సహకరించాలని కోరారు. 5 రాష్ట్రాల ఎన్నికలు అయిపోయాయని.. ఇప్పుడు రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమంలో ప్రధాని మోదీతో కలిసి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకోవాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్న సీఎం రేవంత్ రెడ్డి.. అందులో తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల వాటా ఇవ్వాలని టార్గెట్ పెట్టుకుందని చెప్పారు. తెలంగాణను నంబర్ వన్ చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. వీటిని సాధించేందుకు తెలంగాణను అభివృద్ధి చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే ఇది కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కాదని పేర్కొన్న రేవంత్ రెడ్డి.. ఇది వికాస్ ఉత్సవం అని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్తో తాము కలిసి నడుస్తామని హామీ ఇచ్చారు. దేశంలో 5 రాష్ట్రాల ఎన్నికలు పూర్తి అయిపోయాయని.. ఇప్పుడు రాజకీయాలు మాట్లాడాల్సిన పని లేదని.. అభివృద్ధి గురించే మాట్లాడదామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దేశ జనాభాలో తెలంగాణ 3 శాతం వాటా కలిగి ఉందని.. కానీ దేశ జీడీపీకి మాత్రం 5 శాతం వాటా ఇస్తోందని పేర్కొన్నారు. ప్రధాని మోదీది పెద్ద మనసు అని కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చెబుతుంటారని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి.. తెలంగాణపై కూడా ఆ పెద్ద మనసు చూపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీపై తెలంగాణ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని చెప్పిన సీఎం రేవంత్.. మోదీ దేశాన్ని అభివృద్ధి చేస్తున్నారు కానీ తెలంగాణకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని తెలిపారు. ఈ క్రమంలోనే భారతదేశ అభివృద్ధిలో 6 మహానగరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పిన సీఎం రేవంత్.. దేశ ఖజానాకు అధిక ఆదాయాన్ని ఇస్తున్న నగరాలను కేంద్రం ప్రోత్సహించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ నగరాల అభివృద్ధి, అనుమతుల కోసం ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో)లో స్పెషల్ టాస్క్ ఫోర్స్, సింగిల్ విండో విధానం కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రులను తాను అనేక సార్లు కలిశానని.. తాను కలిసిన పనుల్లో కొన్ని పనులు మాత్రమే అయ్యాయని.. మరికొన్ని ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వికసిత్ భారత్ కోసం ప్రధాని మోదీ ఎంత వేగంగా పని చేస్తున్నారో.. అంత వేగంగా తెలంగాణలో పనులు జరగడం లేదని కాస్త అసహనం వ్యక్తం చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు, రెండో దశ మెట్రో రైల్ ప్రాజెక్టు, మూసీ ప్రాజెక్టు, ఫ్యూచర్ సిటీ, రేడియల్ రోడ్లు, హైదరాబాద్ మచిలీపట్నం పోర్టు కోసం హైవే.. పలు రైల్వే లైన్ వంటి అంశాలపై చర్చించేందుకు ప్రధాని మోదీ కేవలం 2 గంటల సమయం ఇవ్వాలని.. తమ ప్రతిపాదనలను అన్నింటినీ తాను ప్రధాని ముందు ఉంచుతానని తేల్చి చెప్పారు.

## 48 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం

**ఏపీ తీరంపై వాతావరణ మార్పులు**

**మన్నార్ గల్ఫ్ వద్ద ఉపరితల ఆవర్తనం**

విశాఖపట్నం, మే 10 (ఈవార్తలు): బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. రాబోయే 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ అమరావతి వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. మన్నార్ గల్ఫ్, దానిని ఆనుకుని ఉన్న శ్రీలంక పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతోనే ఈ అల్పపీడనం ఏర్పడనుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి స్థిరంగా కొనసాగుతోంది. ఇది మరింత బలపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు, మధ్య, ఎగువ స్థాయి పశ్చిమ గాలుల్లో కొనసాగుతున్న ద్రోణి కోస్తాంధ్రపై ప్రభావం చూపుతోంది. సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఈ ద్రోణి... ఈశాన్య బీహార్ నుంచి జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా తీరప్రాంత ఆంధ్రప్రదేశ్‌లోని మధ్య భాగాల వరకు విస్తరించి ఉంది. ఈ రెండు వాతావరణ వ్యవస్థల ప్రభావంతో రానున్న రోజుల్లో వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## డెహ్రాడూన్‌లో ఏపీ జవాన్ దుర్మరణం

అనకాపల్లి, మే 10 (ఈవార్తలు): విధి నిర్వహణలో జరిగిన ఘోర ప్రమాదంలో భారత సైన్యానికి చెందిన ఓ తెలుగు జవాన్ ప్రాణాలు కోల్పోయారు. అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామానికి చెందిన రాపేటి పూర్ణచంద్రశేఖర్ (37) శుక్రవారం రాత్రి డెహ్రాడూన్‌లో మరణించారు. ఆయన ఆర్మీలో నాయక్‌గా పనిచేస్తున్నారు. ఈ ఘటన ఆయన స్వగ్రామంలో, కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, శుక్రవారం రాత్రి పూర్ణచంద్రశేఖర్ ట్రక్కులో విధులకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఒక చోట ఆర్చి ఒక్కసారిగా కూలిపోవడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ దుర్ఘటనలో నాగాలాండ్‌కు చెందిన మరో సైనికుడు కూడా మరణించినట్లు సమాచారం. అయితే, ప్రమాదం జరిగిన తీరుపై సైన్యం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. పూర్ణచంద్రశేఖర్‌కు భార్య గ్రేసి, ఐదేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. కేవలం నెలన్నర క్రితమే ఆయన తన కుటుంబాన్ని డెహ్రాడూన్‌కు తీసుకెళ్లారు. ఇంతలోనే ఈ విషాదం జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. జనసేన నియోజకవర్గ ఇన్ చార్జి భీమరశెట్టి రామకృష్ణ వెంకటపాలెంలోని ఆయన నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ డెహ్రాడూన్ లోని ఆర్మీ ఉన్నతాధికారులతో మాట్లాడారు. జవాన్ భౌతిక కాయాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ వార్త తెలియగానే వెంకుపాలెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# పల్లెపల్లెన కన్నీరే!

**ఏ గ్రామానికి పోయినా రైతులకు కన్నీళ్లే**

**కొనుగోళ్లు లేక అన్నదాతల అవస్థలు**

**సర్కారుపై మాజీమంత్రి హరీశ్ ధ్వజం**



మెదక్, మే 10 (ఈవార్తలు): కొనుగోలు కేంద్రాల్లో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా.. రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదు. కాంగ్రెస్ వాళ్లే కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చునని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. చేగుంట మండలం కర్ణాల్పల్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ..రేవంత్ రెడ్డి ప్రభుత్వం వడ్ల కొనుగోలు విషయంలో దారుణంగా ఫెయిల్ అయ్యింది. రాష్ట్రంలో రైతుల పరిస్థితి చాలా దయనీయంగా మారిందన్నారు. కర్ణాల్పల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభించి 25 రోజులైంది. ఇప్పటివరకు కేవలం రెండే లారీలు వచ్చాయి. పది రోజులకు ఒక లారీ వస్తే ఈ వడ్లన్నీ ఎప్పుడు కొనాలి.? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు వడ్లు తడిసి, మళ్లీ ఆరబెట్టినా కొనలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఏ గ్రామానికి పోయినా రైతులు కల్లాల్లో కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. రేవంత్ రెడ్డి గారు.. ఇంతవరకు వడ్ల కొనుగోళ్లపై ఒక్క రోజైనా కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెట్టారా? మీ మంత్రులతో ఒక్క మీటింగ్ అయినా చేశారా..? మీకు ఢిల్లీకి పోవడం, హైదరాబాద్ కు రావడం తప్ప వేరే పనే లేదా? ఢిల్లీకి వెళ్లి కప్పం కట్టడం తప్ప.. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతుల కష్టాలు ముఖ్యమంత్రికి, మంత్రులకు పట్టవా..? అని ప్రశ్నించారు. మెదక్ జిల్లాలో ఇప్పటివరకు ఏ ఒక్క మంత్రి అయినా వడ్ల కొనుగోళ్లపై సమీక్ష చేశారా..? ఈ ప్రభుత్వానికి రైతులంటే లెక్క లేదు, పట్టింపు లేదు, చిన్నచూపు ఉన్నందు వల్లే ఈ దుస్థితి దాపురించింది. ఏసీ రూముల్లో కూర్చుని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారు. ఆయన ఒకసారి పోలీసులను పక్కనపెట్టి రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు తిరిగితే రైతుల కన్నీళ్లు, కష్టాలు ఏంటో అర్థమవుతాయి. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆ పార్టీ సర్పంచులే ఇవాళ వడ్లు కొనాలని కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేస్తున్నారు. అంటే మీ ప్రభుత్వ పరిస్థితి ఎంత దయనీయంగా, దారుణంగా తయారైందో ఒకసారి అర్థం చేసుకోవాలి' అని మండిపడ్డారు.



# ఉద్యమకారులకు అండగా..!

**టీఆర్ఎస్ చీఫ్ కవిత అడుగులు**

**ఉద్యమకారుల సంఘాలతో భేటీ**

**వారితో కలిసి సహపంక్తి భోజనం**

హైదరాబాద్, మే 10 (ఈవార్తలు): తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లకు టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మద్దతు ప్రకటించారు. ఉద్యమకారుల సంఘాల సమావేశానికి హాజరై సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుకు జూన్ 2 వరకు గడువు ఇస్తున్నామని అప్పటికీ హామీలు అమలు చేయకుంటే ఉద్యమకారులతో కలిసి ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జార్ఖండ్ ప్రభుత్వం ఉద్యమకారులకు అందిస్తున్న సంక్షేమ పథకాల తరహాలో తెలంగాణలో ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు భువనగిరి జిల్లా కేంద్రంలో సభ నిర్వహించాలని, భూపోరాటాలు ఉధృతం చేయాలని, జిల్లాల వారీగా ఉద్యమకారులతో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో టీఆర్ఎస్ నాయకులు రూప్ సింగ్, సయ్యద్ ఇస్మాయిల్, మలి దశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సామ అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడు మూల ప్రభాకర్ గౌడ్, కార్యదర్శులు వెలమల రాజేష్, శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ అధ్యక్షులు బోగి పద్మ, నాయకులు గుస్సా రవీందర్, అరుణ, తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు పూస శ్రీనివాస్, కొడిమల కృష్ణ, డీఎస్ మాణిక్యమ్మ, తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు రామగిరి ప్రకాశ్, ఉపాధ్యక్షులు బీరకాయల మధుసూదన్, భరత్ రెడ్డి, తొలి దశ ఉద్యమకారుల సంఘం ఉపాధ్యక్షులు సాజిద సికిందర్, శ్రీవల్లి, తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ కె. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఉద్యమకారులతో కలిసి కల్వకుంట్ల కవిత సహపంక్తి భోజనం చేశారు

# పనిమనిషి కల్పన కోసం వేట

**ఐపీఎస్ భార్య హత్య కేసులో పోలీసుల కుస్తీ**

**నిందితుల కోసం నేపాల్ సరిహద్దులో గాలింపు**

హైదరాబాద్, మే 10 (ఈవార్తలు): హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లో సంచలనం సృష్టించిన విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య తనూజ (60) హత్య కేసులో నిందితుల కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో ఊపిరాడకుండా చేసి ఆమెను హత్య చేసినట్లు పోస్టుమార్టం ప్రాథమిక నివేదికలో వెల్లడైంది. ఉన్నతాధికారులు నివసించే ప్రశాసన్‌నగర్‌లో ఇంతటి దారుణం జరగడంతో ఈ కేసును పోలీసులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. దర్యాప్తు కోసం పదికి పైగా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. సుమారు 200 సీసీటీవీ కెమెరాల ఫుటేజీని విశ్లేషించి కీలక ఆధారాలు సేకరించారు. ప్రధాన నిందితురాలు, ఇంట్లో పనిమనిషిగా చేరిన కల్పన తన సహచరులతో కలిసి ఆటోలో నాంపల్లికి వెళ్లి, అక్కడి నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో నాగ్‌పూర్ వైపు పారిపోయినట్లు గుర్తించారు. అయితే, పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు నిందితులు మార్గమధ్యంలోనే రైలు దిగిపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. కొన్ని టాస్క్‌ఫోర్స్ బృందాలు శుక్రవారం సాయంత్రానికే నేపాల్ సరిహద్దులకు చేరుకున్నట్లు సమాచారం. ఈ దోపిడీ, హత్య వెనుక పక్కా ప్రణాళిక ఉందని పోలీసులు నిర్ధారించారు. పనిలో చేరడం దగ్గర నుంచి దోపిడీ వరకు బయటి వ్యక్తుల ఆదేశాలతోనే కల్పన నడుచుకుందని భావిస్తున్నారు. ఆమెకు సన్నిహితంగా ఉన్న పలువురు నేపాలీ మహిళలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితులు ముగ్గురా, నలుగురా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



## పవన్‌కు ప్రధాని మోదీ పరామర్శ

**త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష.. పవన్ కృతజ్ఞతలు**



హైదరాబాద్, మే 10 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరామర్శించారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ప్రధాని, ఆదివారం జూబ్లీహిల్స్‌లోని పవన్ కల్యాణ్ నివాసానికి ప్రత్యేకంగా వెళ్లారు. ఇటీవల సైనస్ సమస్య కారణంగా పవన్ శస్త్రచికిత్స చేయించుకుని, ప్రస్తుతం ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్‌ను కలుసుకున్న ప్రధాని మోదీ, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, తిరిగి ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టాలని ఆకాంక్షించారు. తన కోసం స్వయంగా ఇంటికి వచ్చి పరామర్శించడం పట్ల పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పవన్‌ను పరామర్శించిన అనంతరం, ప్రధాని మోదీ జూబ్లీహిల్స్ లోనే ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి వెళ్లారు.

## నేడు ఢిల్లీకి చంద్రబాబు

**కేంద్ర మంత్రులతో భేటీ.. సీఐఐ బిజినెస్ సమ్మిట్‌కు హాజరు**

అమరావతి, మే 10 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రేపు ఢిల్లీలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లనున్న ముఖ్యమంత్రి ఉదయం 11.30 గంటలకు హోం మంత్రి అమిత్ షాతో భేటీ కానున్నారు. అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తోనూ సమావేశమవుతారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులు, నిధులకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రులతో సీఎం చర్చించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రపంచబ్యాంకు ప్రతినిధులు ముఖ్యమంత్రితో సమావేశం కానున్నారు. సాయంత్రం 4 గంటలకు హోటల్ తాజ్ ప్యాలెస్ లో భారత పరిశ్రమల సమాఖ్య బిజినెస్ సమ్మిట్ కు ఆయన హాజరవుతారు. అనంతరం ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్ ఎస్. మహేంద్రదేవ్ సహా నీతిఆయోగ్ సభ్యులతో ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. రేపు రాత్రికి ఢిల్లీలోనే ముఖ్యమంత్రి బస చేయనున్నారు.



# పెళ్లి విందులో ఒకే వంటకం

**పాక్ వెడ్డింగ్ పరిశ్రమకు కష్టాలు**

**మధ్యప్రాచ్య సంక్షోభంతో ఇబ్బందులు.. రాత్రి 10 గంటలకే వేడుకలు క్లోజ్**

ఇస్లామాబాద్: పెళ్లిళ్లంటే అంగరంగ వైభవంగా జరుపుకునే పాకిస్థాన్‌లో ప్రస్తుతం ఆ వేడుకల కళ తప్పింది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న సంక్షోభం, దేశంలో రికార్డు స్థాయికి చేరిన ద్రవ్యోల్బణం, ప్రభుత్వం విధించిన కఠిన నిబంధనలు ఆ దేశ వెడ్డింగ్ పరిశ్రమను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. దీంతో ఒకప్పుడు ఘనంగా జరిగే వివాహాలు ఇప్పుడు నిరాడంబరంగా, తక్కువ బడ్జెట్‌లో ముగుస్తున్నాయి. ఈ మేరకు పాకిస్థాన్ ప్రముఖ దినపత్రిక 'డాన్'లో ఫాతిమా ఎస్ అత్తర్‌వాలా అనే రచయిత్రి తన కథనంలో విశ్లేషించారు. పెరుగుతున్న ఇంధన ధరలు, ద్రవ్యోల్బణం కారణంగా వెడ్డింగ్ ఖర్చులు విపరీతంగా పెరిగాయని 'షాదియానా' అనే వెడ్డింగ్-టెక్ స్టార్టప్ సహ వ్యవస్థాపకురాలు ఇజ్జా జమాన్ చెప్పిన వివరాలను ఫాతిమా తన కథనంలో ఉటంకించారు. "చాలా కల్యాణ మండపాలు ఒక్కో వ్యక్తిపై రూ.500 వరకు రేట్లను పెంచేశాయి. ఇంధన ధరల అనిశ్చితి కారణంగా శీతాకాలం నాటి బుకింగ్స్‌కు ప్రస్తుత ధరలను ఖరారు చేయడానికి కూడా నిర్వాహకులు నిరాకరిస్తున్నారు" అని ఇజ్జా జమాన్ వివరించారు. పెరుగుతున్న ధరలతో పాటు, పాక్ ప్రభుత్వ కఠిన నిబంధనలు కూడా ఈ పరిశ్రమను మరింత దెబ్బతీస్తున్నాయి. రాత్రి 10 గంటలకే వివాహ వేడుకలు ముగించాలని, ఫంక్షన్లలో ఒకే వంటకాన్ని మాత్రమే అందించాలని ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే పోలీసులు జోక్యం చేసుకుంటున్నారు. ఈ కారణంగా ఇస్లామాబాద్‌లోని అనేక ఫంక్షన్ హాళ్లు మూతపడ్డాయని ఫాతిమా పేర్కొన్నారు.

# తిరుచ్చి ఈస్ట్‌కు విజయ్ రాజీనామా

చెన్నై: తమిళనాడు కొత్త ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ తిరుచ్చి (ఈస్ట్) అసెంబ్లీ నియోజకవర్గానికి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రెండు స్థానాల్లో గెలిచిన ఆయన, పెరంబూర్ నియోజకవర్గాన్ని నిలుపుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీ సెక్రటేరియట్ ఆదివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఏప్రిల్‌లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల నుంచి పోటీ చేసి రెండింటిలోనూ ఘన విజయం సాధించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం, రెండుచోట్ల గెలిచిన అభ్యర్థులు ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఈ నిబంధన మేరకే విజయ్ తిరుచ్చి ఈస్ట్‌ను వదులుకుని, పెరంబూర్‌కు ప్రాతినిధ్యం వహించాలని నిర్ణయం తీసుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి జయలలిత తర్వాత, తమిళనాడులో ఏకకాలంలో రెండు నియోజకవర్గాల్లో పోటీ చేసి గెలిచిన నేతగా విజయ్ నిలిచారు.

# భ్రమలన్నీ తొలగిపోతాయ్: మార్కండేయ ఖట్జూ

న్యూఢిల్లీ: తమిళనాడు ముఖ్యమంత్రిగా టీవీకే అధినేత విజయ్ నేడు ప్రమాణ స్వీకారం చేశారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా టీవీకే ఆవిర్భవించినప్పటికీ.. ఎన్నెన్నో మలుపుల అనంతరం తమిళనాడు ముఖ్మమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్.. విజయ్‌తో పాటు మంత్రివర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సీఎంగా విజయ్ బాధ్యతలు చేపట్టి తొలి ఫైల్ మీద సంతకం కూడా చేశారు. ఇక విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో సినీ, రాజకీయ ప్రముఖుల నుంచి ఆయనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ మార్కండేయ కట్జు చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినీ నటుడు, ప్రజాకర్షణ కలిగిన విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రి అయ్యారన్న జస్టిస్ మార్కండేయ కట్జు.. తమిళనాడు రాష్ట్రం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలపై విజయ్□కు ఏ మాత్రం అవగాహన లేదన్నారు. ఈ విదూషకుడు కలిగించిన భ్రమల నుంచి తమిళనాడు త్వరలోనే తెలుసుకుంటుందంటూ మార్కండేయ కట్జు ట్వీట్ చేశారు.

# విండోస్ 11 ఉచిత అప్ గ్రేడ్

## ఫైల్ ఎక్స్‌ప్లోరర్, టచ్‌ప్యాడ్‌లో కీలక మెరుగుదలలు

న్యూయార్క్: మైక్రోసాఫ్ట్ తన విండోస్ 11 ఆపరేటింగ్ సిస్టమ్‌కు పలు కొత్త ఫీచర్లను జోడిస్తూ లేటెస్ట్ అప్‌డేట్‌లను విడుదల చేసింది. విండోస్ ఇన్‌సైడర్ ప్రోగ్రామ్‌లోని బీటా, ఎక్స్‌పెరిమెంటల్ ఛానల్ యూజర్ల కోసం ఈ కొత్త అప్ డేట్లను అందుబాటులోకి తెచ్చింది. ఫైల్ ఎక్స్‌ప్లోరర్‌లో ముఖ్యమైన మెరుగుదలలు, టచ్‌ప్యాడ్‌కు కొత్త జెస్చర్లు, విద్యాసంస్థలకు ఉచిత అప్‌గ్రేడ్ వంటి కీలక మార్పులను ఈ అప్‌డేట్‌లో భాగంగా పరిచయం చేసింది. ఈ అప్‌డేట్‌లో భాగంగా ఫైల్ ఎక్స్‌ప్లోరర్‌ను మరింత మెరుగుపరిచారు. ఇప్పటివరకు ఫైల్ సైజులు కేవలం ఖదీలలో మాత్రమే కనిపించేవి. ఇకపై ఫైల్ పరిమాణాన్ని బట్టి ఎంబీ, జీబీలలో కూడా స్పష్టంగా కనిపిస్తాయి. దీంతోపాటు అడ్రస్ బార్‌లో క్లిష్టమైన పాత్‌లను సులభంగా గుర్తించడం, ఫైల్స్ రీనేమ్ చేసేటప్పుడు తలెత్తే సమస్యలను పరిష్కరించారు. ల్యాప్‌టాప్ యూజర్ల కోసం ప్రెసిషన్ టచ్‌ప్యాడ్‌లకు కొత్త సామర్థ్యాలను జోడించారు. దీని ద్వారా టచ్‌ప్యాడ్ స్క్రోలింగ్, జూమ్ వేగాన్ని నియంత్రించుకోవచ్చు. అలాగే, పదేపదే స్క్రోల్ చేస్తే వేగం పెరిగేలా 'యాక్సిలరేటెడ్ స్క్రోలింగ్' ఫీచర్‌ను కూడా అందించారు. ఈ అప్‌డేట్‌లో విద్యాసంస్థలకు (కే-12) మైక్రోసాఫ్ట్ ఒక శుభవార్త చెప్పింది. విండోస్ 11 హోమ్ ఎడిషన్ ఉన్న డివైజ్‌లను ఎలాంటి ఖర్చు లేకుండా విండోస్ 11 ప్రొ ఎడ్యుకేషన్‌కు అప్‌గ్రేడ్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. అయితే, ఇది వన్-వే అప్‌గ్రేడ్ మాత్రమేనని, తిరిగి హోమ్ ఎడిషన్‌కు మారాలంటే క్లీన్ ఇన్‌స్టాల్ చేయాల్సి ఉంటుందని మైక్రోసాఫ్ట్ స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈ ఫీచర్లు టెస్టింగ్ దశలో ఉండగా, త్వరలోనే సాధారణ యూజర్లందరికీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.




# ఇండియా కూటమికి ఢోకా లేదు: చిదంబరం

**విజయ్‌ను కూటమిలోకి ఆహ్వానించాలని సూచన**

న్యూఢిల్లీ: తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామాల మధ్య డీఎంకేతో కాంగ్రెస్ పార్టీ తెగదెంపులు చేసుకోవడం జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే)కు మద్దతిచ్చి, ఆయన్ను ముఖ్యమంత్రిని చేయడంలో కాంగ్రెస్ కీలకపాత్ర పోషించింది. ఈ చర్యను డీఎంకే 'ద్రోహం'గా అభివర్ణించడంతో, జాతీయ స్థాయిలో ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి భవిష్యత్తుపై సందేహాలు మొదలయ్యాయి. అయితే, రాష్ట్ర స్థాయిలో విభేదాలు తలెత్తినా 'ఇండియా' కూటమికి ఎలాంటి నష్టం వాటిల్లదని కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం ధీమా వ్యక్తం చేశారు. శనివారం నాడు నాటకీయ పరిణామాల మధ్య, గవర్నర్ ఏవీ ఆర్లేకర్‌ను కలిసిన విజయ్ 120 మంది ఎమ్మెల్యేల మద్దతు లేఖను సమర్పించారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మంది కంటే ఇది ఇద్దరు ఎక్కువ. కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు మద్దతివ్వడంతో ఇది సాధ్యమైంది. దీంతో ఆదివారం ఉదయం విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ పరిణామాలపై తాజాగా మాట్లాడిన చిదంబరం "నా



దృష్టిలో ఇండియా కూటమి కొనసాగుతుంది. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ కూటమికి వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కేవలం తమిళనాడులో కాంగ్రెస్‌తో పొత్తు ముగిసిందని మాత్రమే చెప్పారు" అని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పొత్తుల మధ్య తేడా ఉంటుందని ఆయన వివరించారు. "కేరళలో కాంగ్రెస్, సీపీఎంలు ప్రత్యర్థులుగా ఉన్నా, ఢిల్లీ స్థాయిలో 'ఇండియా' కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లోనూ మమతా బెనర్జీ కూటమిని బలోపేతం చేస్తానని పునరుద్ఘాటించారు. కాబట్టి కూటమి కొనసాగకపోవడానికి కారణం కనిపించడం లేదు" అని ఆయన పేర్కొన్నారు. డీఎంకే కూటమిలో కొనసాగుతుందని తాను ఆశిస్తున్నట్లు చిదంబరం తెలిపారు. అంతేకాదు, విజయ్ నేతృత్వంలోని టీవీకేని కూడా 'ఇండియా' కూటమిలోకి తీసుకురావాలని ప్రయత్నించాలని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

# విజయ్ పేషీలో కీలక అధికారులు

**ప్రధాన కార్యదర్శిగా సెంథిల్ కుమార్ నియామకం**

**రెండో ప్రత్యేక కార్యదర్శిగా జి. లక్ష్మీ ప్రియకు బాధ్యతలు**

చెన్నై: తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన గంటల వ్యవధిలోనే ఆయన తన కార్యాలయంలో (సీఎంఓ) కీలక నియామకాలు చేపట్టారు. ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులను తన సహాయకులుగా నియమిస్తూ తొలి ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ఆరోగ్య శాఖ కార్యదర్శిగా పనిచేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి పి. సెంథిల్ కుమార్‌ను ముఖ్యమంత్రికి ప్రధాన కార్యదర్శిగా (స్పెషల్ సెక్రటరీ-1) నియమించారు. అదేవిధంగా, ఆది ద్రావిడ సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఉన్న జి. లక్ష్మీ ప్రియను ముఖ్యమంత్రికి రెండో ప్రత్యేక కార్యదర్శిగా (స్పెషల్ సెక్రటరీ-2) నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే మూడో ప్రత్యేక కార్యదర్శి నియామకం కూడా ఉంటుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. సాధారణంగా తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయంలో ముగ్గురు ప్రత్యేక కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తారు. అంతకుముందు, జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం విజయ్ నేరుగా సచివాలయానికి చేరుకున్నారు. అక్కడ పోలీసులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి ఛాంబర్‌లోకి ప్రవేశించిన ఆయన, తొలిసారిగా సీఎం కుర్చీలో కూర్చునే ముందు కాస్త భావోద్వేగానికి గురయ్యారు. ఆ సమయంలో సీనియర్ మంత్రి కె.ఏ. సెంగొట్టయ్యన్ ఆయనను ప్రోత్సహించడంతో, విజయ్ చిరునవ్వుతో తన కుర్చీలో ఆసీనులయ్యారు.

# ఖజానా ఖాళీ అని సాకులొద్దు

**విజయ్‌కు స్టాలిన్ చురకలు**

చెన్నై: తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూనే, తీవ్రమైన రాజకీయ విమర్శలతో కూడిన హెచ్చరికలు జారీ చేశారు. "తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే మీరు సంతకం చేసిన ఉత్తర్వులను కూడా నేను స్వాగతిస్తున్నాను. అయితే, వస్తూనే ప్రభుత్వం దగ్గర డబ్బు లేదని మాట్లాడటం మొదలుపెట్టవద్దు. అవన్నీ ఉన్నాయి. ప్రజలకు ఇవ్వాలన్న మనసు, పరిపాలనా దక్షత



మాత్రమే కావాలి. గత ఐదేళ్లలో మేము కోవిడ్, వరదలు వంటి ఎన్నో సమస్యలను, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వివక్షను ఎదుర్కొని లెక్కలేనన్ని ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేశాం. 'గత ప్రభుత్వం రూ. 10 లక్షల కోట్ల అప్పు చేసి, ఖజానాను ఖాళీ చేసి వెళ్లిపోయింది' అని మీ మొదటి ప్రసంగంలోనే ఆరోపించారు కదా. తమిళనాడు అప్పులు అనుమతించిన పరిధిలోనే ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి గత ఫిబ్రవరి బడ్జెట్‌లోనే మేము స్పష్టంగా చెప్పాం. ఆ విషయం మీకు తెలియదా? ఆ తర్వాతే కదా మీరు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చింది? మీకు ఓటు వేసిన ప్రజలను మళ్లీ తప్పుదోవ పట్టించి మోసం చేయకండి. 'ఆచరణ సాధ్యమైన వాటినే హామీలుగా ఇస్తాను' అని చెప్పి అధికారంలోకి వచ్చిన మీరు ఇప్పుడిప్పుడే ప్రభుత్వ పాలనలోకి అడుగుపెడుతున్నారు. త్వరలోనే, మాలాగా మీరు కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చాలనే మెలకువలను నేర్చుకుంటారని నేను నమ్ముతున్నాను. ఓటు వేసిన ప్రజలతో పాటు, నేను కూడా అదే ఆశిస్తున్నాను" అంటూ స్టాలిన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.





## లచ్చక్కపేట ఎల్లమ్మ పట్నాల్లో వసంత

సారంగపూర్, మే 10 (ఈవార్తలు): సారంగపూర్ మండలం లచ్చక్కపేట గ్రామంలో నిర్వహించిన రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం, పట్నాల కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె నాయకులతో కలిసి రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామ ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామస్తులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి భావంతో కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై వ్యక్తి మృతి

వెల్గటూర్, మే 10 (ఈవార్తలు): మద్యానికి బానిసై, వారం రోజులుగా సరైన ఆహారం తీసుకోకుండా మద్యం సేవిస్తూ వచ్చిన ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వెల్గటూర్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దండేపల్లి మండలం నర్సాపురం గ్రామానికి చెందిన కొయ్యాడ వెంకటేష్ (45), గౌడ్, చాలాకాలంగా మద్యానికి బానిసై ప్రతిరోజూ మద్యం సేవించేవాడు. గత వారం రోజులుగా ఎలాంటి ఆహారం తీసుకోకుండా మద్యం తాగుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 9వ తేదీ రాత్రి వెల్గటూర్ మండలం జగదేవ్‌పేట గ్రామంలోని తమ బంధువైన అమరగొని వెంకటేష్ ఇంటికి వచ్చిన వెంకటేష్, అక్కడ కూడా ఆహారం తీసుకోకుండా మద్యం సేవించి నిద్రపోయాడు. శనివారం ఉదయం నిద్రలేపేందుకు ప్రయత్నించగా స్పందించకపోవడంతో పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి తల్లి కొయ్యాడ నరసవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెల్గటూర్ ఎస్ఐ పి. ఉదయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శవపంచనామ నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటన స్థలాన్ని జగిత్యాల డీఎస్పీ కె. పురుషోత్తం రెడ్డి, ధర్మపురి సీఐ రామ్‌నరసింహారెడ్డి సందర్శించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## ట్రాక్టర్- బైక్ ఢీకొని యువకుడు మృతి



ధర్మపురి, మే 10 (ఈవార్తలు): ధర్మపురి సమీపంలోని ఎన్‌హెచ్-63పై ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఈ ప్రమాదం భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ట్రాక్టర్ (టీఎస్ 21 టీ 1882), బైక్ (టీజీ 21 ఎస్ 6024 ఢీకొనడంతో తోగిటి వాసు (32) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి బాబాయి తోగిటి వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

## టీజేఎస్ 4వ ప్లీనరీని విజయవంతం చేయండి

**జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి**



జగిత్యాల, మే 10 (ఈవార్తలు): తెలంగాణ ఉద్యమాల రథ సారధి ప్రొఫెసర్ యం. కోదండరాం స్థాపించిన "తెలంగాణ జన సమితి" యొక్క నాలుగవ ప్లీనరీని విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి కోరారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఈ నెల 12 మంగళ వారం ఉదయం 10-00 గంటలకు హైదరాబాద్ లోని నెక్లెస్ రోడ్డులో గల జల విహార్ లో రాష్ట్ర అధ్యక్షులు ప్రో.కోదండరాం అధ్యక్షతన తెలంగాణ జన సమితి నాలుగవ ప్లీనరీ నిర్వహించడం జరుగుతుందన్నారు. జగిత్యాల జిల్లా నుండి అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

**ఆదివారం 45 వేల మందికి పైగా దర్శనం**

వేములవాడ, మే 10 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం నుంచి భక్తుల రద్దీ భారీగా కొనసాగింది. సుమారు 45 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. భక్తులు స్వామివారికి తలనీలాలు, కోడె మొక్కులు సమర్పించడంతో పాటు అభిషేకం, నిత్య కళ్యాణం, చండీ హోమం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, కుంకుమార్చన, లింగార్చన, ఆకుల పూజలు వంటి ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి ఆధ్వర్యంలో ఆలయ అధికారులు సమగ్ర ఏర్పాట్లు చేపట్టారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శన ఏర్పాట్లు, తాగునీరు, క్యూలైన్లు, ప్రసాదాల పంపిణీ వంటి అన్ని సౌకర్యాలను కల్పించినట్లు అధికారులు తెలిపారు.

## కొండగట్టులో వృద్ధుడి అస్తిపంజరం

మల్యాల, మే 10 (ఈవార్తలు): కొండగట్టులో 60 నుంచి 70 ఏళ్ల వయసు ఉన్న వృద్ధుడి అస్తిపంజరాలు దొరకడం కలకలం రేపింది. ఆలయ సమీపం లో ని బొజ్జ పోతన్న ప్రాంతంలో 60 నుంచి 70 సంవత్సరాల వయసుగల మగ వ్యక్తి చనిపోయి, మొత్తం ఎండిపోయి ఉంది. ఈ ఘటనపై పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మల్యాల పోలీసులు తెలిపారు.

## హనుమాన్ జన్మోత్సవాలు

# ఘనంగా ప్రారంభం

**కొండగట్టు అంజన్న సేవలో ఎమ్మెల్యే సత్యం**



మల్యాల, మే 10 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వేలాది మంది భక్తుల నడుమ ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం నుండి పవిత్ర శేష వస్త్రాలను భద్రాచల దేవస్థానం ఈవో దామోదర్ తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శేష వస్త్రాలను స్వీకరించి కొండగట్టు ఆలయానికి తీసుకురాగా, ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు డప్పు చప్పుళ్లు, మంగళ వాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణల మధ్య శోభాయాత్ర నిర్వహించి, శేష వస్త్రాలను ఆలయ ఈవో ఎస్ అంజన రెడ్డి, స్థానాచార్యులు కపిందర్ స్వామి మరియు ఆలయ అర్చకులకు అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా భక్తుల జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగిపోయింది. తదుపరి భద్రాచల దేవస్థానం ఈవో దామోదర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనాలు అందించి శేషవస్త్రంతో సత్కరించి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో స్వస్తి వాచనము, రక్షాబంధనము, ఋత్విక్ వరణము, అరుణి మథనము, దేవతాహ్వానము, యాగశాల ప్రవేశము, స్థాపిత దేవతారాధన, అగ్ని ప్రతిష్ఠ, హవనము తదితర వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అలాగే శ్రీ స్వామివారికి ప్రత్యేక అభిషేకములు, సహస్రనామార్చన, పారాయణములు, నైవేద్యములు నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో ఆలయ ఏఈఓ గుండి హరిహర్నాథ్, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, సునీల్, టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్, ఆలయ అర్చకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా రానున్న మూడు రోజుల పాటు యాగశాలలో త్రైయాహ్నిక హోమాలు, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



## హనుమాన్ జయంతికి వేములవాడ సిద్ధం

**భక్తులకు ఇబ్బందులు లేకుండా విస్తృత ఏర్పాట్లు**

**అధికారులతో ఆయల ఈవో రమాదేవి సమీక్ష**

వేములవాడ, మే 10 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఈ నెల 12 న జరగనున్న హనుమాన్ జయంతి సందర్భంగా దేవస్థానం అనుబంధ ఆలయాలైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం, శ్రీ నగేశ్వర స్వామి ఆలయం, హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయాల శుద్ధి పనులు, రంగులు వేయడం, రంగురంగుల పూలతో ప్రత్యేక అలంకరణలు చేపట్టనున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని దేవస్థానం అధికారులు కసరత్తు చేస్తున్నారు. హనుమాన్ జయంతి ఏర్పాట్లపై భీమేశ్వర సదన్ కాన్ఫరెన్స్ హాల్లో దేవస్థానం ఈవో శ్రీమతి రమాదేవి ఆలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని, వేసవి తీవ్రత కారణంగా త్రాగునీరు, నీడ టెంట్లు, గ్రీన్ మ్యాట్లు వంటి ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే లడ్డు కౌంటర్లు, అన్నదానం, ఉచిత పులిహోర పంపిణీ, ప్రత్యేక డ్యూటీలు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఆలయ ప్రాంగణంతో పాటు పార్కింగ్ ప్రాంతాల్లో కూడా పారిశుభ్రతను మెరుగుపరచాలని తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా చిన్న జయంతి, పెద్ద జయంతి వేడుకలకు కొండగట్టు వెళ్లే ముందు అనేక మంది భక్తులు వేములవాడకు వచ్చి స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోందని ఈవో పేర్కొన్నారు. తెలంగాణలో ఏ పండుగ జరిగినా భక్తులు వేములవాడకు వచ్చి మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడం విశేషమన్నారు. భక్తులతో మర్యాదగా వ్యవహరించి వారికి ఎదురయ్యే ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఈఓ, ఈఈ, ఏఈఓలు, సూపరింటెండెంట్లు, ఆలయ అర్చకులు, దేవస్థానం ఉద్యోగులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిళ్ల పంపిణీ

**రోటరీ క్లబ్, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**




జగిత్యాల, మే 10 (ఈవార్తలు): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో, ఏపీ ప్రివెంటివ్ హెల్త్ క్లినిక్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పావని కంటి ఆసుపత్రి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి పాల్గొని విద్యార్థులకు ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు తోడుగా రోటరీ క్లబ్, రెడ్‌క్రాస్ వంటి స్వచ్ఛంద సంస్థలు సమాజ సేవలో ముందుండటం అభినందనీయమన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా జగిత్యాల ప్రాంతంలో సేవే పరమావధిగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉచిత కంటి ఆపరేషన్లు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, ఉపకరణాల పంపిణీ, విద్యార్థులకు కంటి పరీక్షలు, 'రోటరీ గంగా' పేరుతో మంచినీటి ట్యాంకుల ఏర్పాటు, ఉచిత వైద్య శిబిరాలు వంటి అనేక సేవా కార్యక్రమాలను టీమ్‌వర్క్‌గా నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు తోడుగా పారిశ్రామికవేత్తలు, వ్యాపార సంస్థలు సిఎస్ఆర్ నిధులతో సహకరిస్తే అర్హులకు మరింత ఉపయోగపడుతుందని అన్నారు. డీఎస్పీ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ.. రోటరీ క్లబ్, ఏపీ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వంటి సంస్థలు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, వారి కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ కరుణాకర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ కార్యదర్శి మంచాల కృష్ణ, కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు సిరిసిల్ల శ్రీనివాస్, రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షులు, సభ్యులు కొత్త ప్రతాప్, టీవీ సూర్యం, డా. వెంకటేశ్వర్, డా. విజయ్, డా. శేఖర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, కౌన్సిలర్లు సుంకేటి మమత, దుమాల రాజ్‌కుమార్, కోరే గంగమల్లు, నాయకులు బాలముకుందం, ఖజిం అలీ, బాస మహేష్, వేణు, అబ్బూరి మల్లేశం గౌడ్, పులి నర్సయ్య, వంశీ, మహేష్, రవి గౌడ్, రామకృష్ణారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు గట్టు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మూతబడ్డ పాఠశాలలో లైబ్రరీ



మల్యాల, మే 10 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా, మల్యాల మండంలోని సర్వాపూర్ (కొత్తపల్లి) గ్రామంలో గత ప్రభుత్వంలో పాఠశాల మూతపడినది. ఆ గ్రామ యువకులు ఆదివారం పాఠశాలలోని శుభ్రం చేశారు. ఖాళీ భవనంలో విద్యార్థులకు సౌకర్యంగా ఉండేలా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అంజి, మదుసుదన్, సాగర్, సాయి తెలిపారు. ఈ అంశాన్ని ఎంఈవో దృష్టికి తీసుకెళ్లి లైబ్రరీని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.



## రోడ్డు ప్రమాద బాధితుడికి అండగా విప్

**గాయపడిన వ్యక్తిని తన వాహనంలో ఆస్పత్రికి తరలింపు**

**వైద్యులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశాలు**

వేములవాడ, మే 10 (ఈవార్తలు): వేములవాడ పట్టణ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రమాదాన్ని గమనించిన వెంటనే తన వాహనాన్ని ఆపి క్షతగాత్రుడిని స్వయంగా ఆస్పత్రికి తరలించి ఆదర్శంగా నిలిచారు. ఆది శ్రీనివాస్ వేములవాడ రూరల్ మండల పర్యటన ముగించుకుని పట్టణానికి తిరిగి వస్తున్న సమయంలో చెక్కపల్లి రోడ్డులోని పెద్దమ్మ చౌరస్తా వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. వేములవాడ పట్టణంలోని భగవంతరావు నగర్‌కు చెందిన ఊరడి భూమయ్య వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనను గమనించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెంటనే స్పందించి బాధితుడిని పరామర్శించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు తెలుసుకున్న అనంతరం ఆలస్యం చేయకుండా తన సొంత వాహనంలోనే క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అవసరమైన అన్ని విధాల సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద సమయంలో ఆది శ్రీనివాస్ చూపిన చొరవ, మానవత్వంపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రజా ప్రతినిధి అంటే ప్రజల కష్టసుఖాల్లో ముందుండాలని ఆయన మరోసారి నిరూపించారని పలువురు అభిప్రాయపడ్డారు.



## అంజన్న జన్మోత్సవాలకు 950 మంది పోలీసులు

**జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ వెల్లడి**

జగిత్యాల బ్యూ, మే 10 (ఈవార్తలు): ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా భక్తులు ప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేలా 950 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. కొండగట్టు జేఎన్‌టీయూ కళాశాలలో నిర్వహించిన బ్రీఫింగ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బందోబస్తును ఆరు సెక్టార్లుగా విభజించి, మూడు షిఫ్టుల విధానంలో పోలీసు సిబ్బందికి విధులు కేటాయించినట్లు వెల్లడించారు. జయంతి సందర్భంగా ఆలయానికి భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి నేరాలకు తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు పోలీసులు ఓపికతో సూచనలు అందిస్తూ విధులు నిర్వర్తించాలని, ఎక్కడా అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా దేవస్థానం, మాల విరమణ ప్రాంతాల్లో విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి భక్తులు క్యూ లైన్లను పాటించేలా చూడాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 24 గంటల పాటు పోలీసు నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఈ ఏడాది భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో భారీ సంఖ్యలో వచ్చే వాహనాలను క్రమబద్ధంగా పార్కింగ్ చేసేలా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ట్రాఫిక్, పార్కింగ్ ప్రాంతాల్లో విధుల్లో ఉన్న సిబ్బంది ట్రాఫిక్ జామ్‌లు లేకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రివేళల్లో ప్రమాదాలు నివారించేందుకు స్టాపర్లు, కోన్స్, రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

**కాలినడక భక్తులకు సూచనలు**

హనుమాన్ దీక్ష తీసుకుని కాలినడకన కొండగట్టుకు వచ్చే భక్తుల భద్రత కోసం రేడియం స్టిక్కర్లను వారి బ్యాగులు, జెండాలకు అంటించినట్లు తెలిపారు. రోడ్డు ఇరువైపులా నడిచేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, వాహనాలను గమనిస్తూ గమ్యస్థానానికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటరమణ, పురుషోత్తం రెడ్డి, ఎస్‌బీ ఇన్స్పెక్టర్ అరిఫ్ అలీ ఖాన్, సీఐలు రవి, సుధాకర్, రామ్ నరసింహారెడ్డి, సురేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల రూరల్, మే 10 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలం సోమనపల్లి గ్రామానికి చెందిన నీలం సునీత--సత్యం దంపతులు, జగిత్యాల మండలం హబ్సిపూర్ గ్రామానికి చెందిన గాదె రజిత-చంద్రయ్య కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, లబ్ధిదారులకు చీరలను కానుకగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేపడుతున్న గృహ నిర్మాణ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఎల్లారెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కొలుగురి దామోదర్ రావు, పాక్స్ ఛైర్మన్ సందీప్ రావు, బాల ముకుందం, సర్పంచులు చెవుల గంగన్న రాజేందర్, మల్లయ్య, హరీష్, పరశురామ్ గౌడ్, మహేష్, మాజీ సర్పంచులు మహేశ్వరరావు, అంజన్న, రాజేశ్వర్ రెడ్డి, నాయకులు మోహన్ రెడ్డి, గంగాధర్, ఆశన్న, గంగారెడ్డి, భూమయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## జువ్వాడి రత్నాకర్ రావుకు ఘన నివాళి

జగిత్యాల, మే 10 (ఈవార్తలు): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు వర్ధంతి సందర్భంగా జగిత్యాల పట్టణ పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జువ్వాడి రత్నాకర్ రావు విగ్రహానికి ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జువ్వాడి కృష్ణారావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్యతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రజాసేవలో జువ్వాడి రత్నాకర్ రావు చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ గిరి నాగభూషణం, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాగర్ రావు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ రావు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కొలుగురి దామోదర్ రావు, సుధాకర్ రావు, మహేశ్వర్ రావు, వెలమ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లవ్యాలి చిత్రం







## కొండగట్టులో టీనేజ్ తీన్మార్ చిత్రం టైటిల్ ప్రకటన

జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో గోవింద వాసుదేవాయ చిత్ర యూనిట్ ప్రత్యేక పూజలు నిర్వహించింది. పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా దర్శకుడు హీరో రాజ్ చెన్నమ్మధోని చేతుల మీదుగా టీనేజ్ తీన్మార్ చిత్రం టైటిల్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ఇది తన మూడో చిత్రం అని, పూర్తి తెలంగాణ యాస భాషలో తెరకెక్కిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మొగిలిపాలెం రమేశ్, నటీనటులు హరీశ్, అజయ్, సంతోష్, శ్రీను, శ్రీహరి, చైతన్య, మహా, గంగవ్వ, సదన్న, సత్తిపండు, గీతన్, సాయి తేజ పాల్గొన్నారు. అలాగే ఛాయాగ్రాహకుడు పీఎస్ మణికర్ణన్, సంగీత దర్శకుడు ప్రభంజన్, ఓరుగంటి శేఖర్ తదితరులు హాజరయ్యారు.

## రెండు వారాల్లో జన నాయగన్ రిలీజ్

తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే పార్టీ అధినేత విజయ్ నటించిన చివరి సినిమా జయ నాయగన్ సినిమా రిలీజ్ కు డేట్ ఎట్టకేలకు ఫిక్స్ అయింది. ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు రంగం సిద్ధం చేసింది చిత్రం బృందం. కేవలం రెండు వారాల్లో సినిమాను రిలీజ్ చేస్తామని తాజాగా నిర్మాత వెంకట్ కే నారాయణ అధికారికంగా ప్రకటన చేశారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిమ్ సర్టిఫికేషన్ తో చర్చలు జరుపుతున్నామని కూడా క్లారిటీ ఇచ్చారు. విజయ్ క్రమ శిక్షణ, అంకిత భావం ఉన్న వ్యక్తి అని వెల్లడించారు. ఇక ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత సినిమా రిలీజ్ చేసుకోబోతున్నట్లు ప్రకటన చేశారు. కాగా సెన్సార్ వివాదం కారణంగా ఈ మూవీ పదే పదే వాయిదా పడుతూ వచ్చిన సంగతి తెలిసిందే. వాస్తవంగా 2026 సంక్రాంతి కానుకగా ఈ సినిమా రిలీజ్ కావాల్సి ఉంది. కానీ అనేక రకాల కారణాల వల్ల సినిమా రిలీజ్ లేట్ అయింది.




## రెండు భాగాలుగా విశ్వంభర

మెగాస్టార్ చిరంజీవి హీరోగా రూపొందిన విశ్వంభర చిత్రాన్ని కూడా రెండు భాగాలుగా విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు ప్రస్తుతం ఓ వార్త టాలీవుడ్ సర్కిల్లో వైరల్‌గా మారింది. త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు మల్లిడి వశిష్ట దర్శకత్వం వహిస్తున్నారు. ఎం. ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్ వారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం అత్యంత భారీ గ్రాఫిక్స్‌తో రూపొందుతోంది. ఇప్పటివరకు ఈ సినిమా విడుదలపై పెద్దగా స్పష్టత లేదు. ఇక తాజాగా ఈ సినిమాను రెండు భాగాలుగా విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు సమాచారం. మరి నిజంగానే ఈ సినిమాను రెండు భాగాలుగా విడుదల చేస్తారా? లేదా అనేది తెలియాలి అంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

## నేటి నుంచి స్పిరిట్ కొత్త షెడ్యూల్

గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ అభిమానులను ఎంటర్‌టైన్ చేసేందుకు బ్యాక్ టు బ్యాక్ సినిమాలను ట్రాక్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ స్పిరిట్. యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా డైరెక్ట్ చేస్తున్నాడు. షూటింగ్ దశలో ఉన్న ఈ మూవీకి సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది. తాజా రిపోర్ట్స్ ప్రకారం స్పిరిట్ కొత్త షెడ్యూల్ సోమవారం ప్రారంభం కానుందట. ప్రభాస్, వివేక్ ఒబెరాయ్ మధ్య వచ్చే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్‌ను ఈ షెడ్యూల్‌లో షూట్ చేయనున్నారని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు సుమారు 2 నెలలపాటు సుదీర్ఘంగా ఈ షెడ్యూల్ కొనసాగనుందట. ఇందులో ప్రభాస్ తొలిసారి పోలీసాఫీసర్‌గా నటిస్తుండటంతో అభిమానుల్లో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి.







## 'పెద్ది'లో ఇంట్రెస్టింగ్‌గా నా పాత్ర: జగపతి బాబు

టాలీవుడ్ సీనియర్ నటుడు జగపతిబాబు తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తాను నటించిన పెద్ది గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా తన పాత్ర గురించి మాట్లాడుతూ పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించారు. జగపతిబాబు మాట్లాడుతూ... "నేను రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమాలో నటించాను. ఈ చిత్రంలో నా పాత్ర చాలా అద్భుతంగా ఉంటుంది. నా పాత్ర ట్రీట్మెంట్‌ను కూడా బుచ్చిబాబు చాలా కొత్తగా డిజైన్ చేశారు. సినిమా విడుదలైన తర్వాత నా పాత్రను చూసి ప్రేక్షకులు ఖచ్చితంగా సర్ప్రైజ్ అవుతారు" అని అన్నారు. అలాగే ఈ సినిమా భారీ విజయాన్ని సాధిస్తుందని, ఇందులో పనిచేసిన నటీనటులు, టెక్నీషియన్స్, నిర్మాతలకు మంచి గుర్తింపు తీసుకువస్తుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఇప్పటికే జగపతిబాబు పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేయగా అది ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. దీంతో ఆయన పాత్రపై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. మరి ఈ సినిమాతో జగపతిబాబుకు ఎలాంటి గుర్తింపు వస్తుందో చూడాలి. పెద్ది చిత్రాన్ని జూన్ 4న తెలుగుతో పాటు తమిళ్, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో భారీ స్థాయిలో విడుదల చేయనున్నారు.

## అర్నెళ్లు నరకం చూశా



బాలీవుడ్ స్టార్ నటి కియారా అద్వానీ, తల్లి అయిన తర్వాత తన జీవితంలో చోటు చేసుకున్న భావోద్వేగ మార్పుల గురించి మొదటిసారి మనసు విప్పి మాట్లాడారు. 2025 జూలైలో తన కుమార్తె సారాయకు జన్మనిచ్చిన తర్వాత, తను ఎదుర్కొన్న పోస్ట్‌పార్టమ్ (బిడ్డ పుట్టిన తర్వాత వచ్చే మానసిక స్థితి) దశ గురించి ఒక ఇంటర్వ్యూలో వివరిస్తూ ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. బిడ్డ పుట్టిన తర్వాత తన గుర్తింపు పూర్తిగా మారిపోయిందని కియారా తెలిపారు. "మొదటి ఆరు నెలలు నాపై నాకు జాలి చూపించుకోవడం కూడా చాలా కష్టంగా అనిపించేది నరకం చూశా. ఎప్పుడూ ఇతరుల గురించి ఆలోచించే నేను, మొదటిసారి నా కోసం నేను సమయం కేటాయించుకోవాలని గ్రహించాను. నాలోని భావాలను అర్థం చేసుకోవడానికి, నన్ను నేను ప్రేమించుకోవడానికి ఈ మాతృత్వం ఒక గొప్ప మలుపులా నిలిచింది" అని కియారా ఎమోషనల్ అయ్యారు.



## మా పారితోషికం తగ్గించాలని చూస్తారు

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అక్కర్లేని భామ కృతిసనన్. తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా టాలీవుడ్‌లో ఈ భామకున్న ఫ్యాన్ బేస్ ఎక్కువే అని చెప్పాలి. చాలా కాలంగా హిందీ సినిమాలకే పరిమితమైన ఈ ముద్దుగుమ్మ కాస్ట్ కటింగ్ కారణంగా హీరోయిన్లు ఎలా ప్రభావితం అవుతున్నారో చెప్పుకొచ్చింది కృతిసనన్. బడ్జెట్ నియంత్రణలో భాగంగా నిర్మాతలు మొదట హీరోయిన్ల పారితోషికం తగ్గించడంపైనే ఫోకస్ పెడుతున్నారని తాజాగా ఓ చర్చ నెట్టింట కొనసాగుతుంది. ఈ విషయమై కృతిసనన్ మాట్లాడుతూ.. మధ్య శ్రేణి (మిడ్ రేంజ్ హీరోయిన్లు) రెమ్యునరేషన్లను నిర్మాతలు పున: పరిశీలిస్తున్నారంది. అయితే ఇండస్ట్రీలో స్టార్ హీరోలకు ఇచ్చే భారీ రెమ్యునరేషన్లపై ఇప్పటికీ అతి తక్కువ స్థాయిలో చర్చ నడుస్తుందని చెప్పింది. కాస్ట్ కటింగ్ ఎఫెక్ట్ ప్రధానంగా హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులపైనే పడుతుందని అభిప్రాయపడ్డింది. అదే సమయంలో కేవలం టాప్ హీరోల రెమ్యునరేషన్లు తగ్గించుకుంటేనే మార్పు మొదలవుతుందని ఓ వర్గానికి చెందిన దర్శకనిర్మాతలు నమ్ముతున్నారని చెప్పుకొచ్చింది. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## వైభవ్‌ను పెద్దగా పట్టించుకోను: రబాడ

ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అదరగొడుతున్నాడు. 15 ఏళ్ల వయసులోనే బౌలర్లను ఉతికారేస్తుండడంతో అతడికి బౌలింగ్ చేయాలంటేనే భయపడుతున్నారు. హాజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్, బుమ్రా, కమిన్స్, షమీ లాంటి టాప్ పేసర్లు కూడా అతడి పరుగుల వరదని ఆపలేకపోయారు. అయితే గుజరాత్ టైటాన్స్ స్టార్ పేసర్ కగిసో రబాడ మాత్రం వైభవ్ సూర్యవంశీని పెద్దగా పట్టించుకోనంటూ సంచలన వ్యాఖ్యలు చేశాడు. అతడికి బంతులు వేసే క్రమంలో 11 ఏళ్లుగా తనకు తెలిసిన విధానాన్నే ఇప్పటికీ కొనసాగిస్తున్నానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తన బౌలింగ్‌లో వైభవ్ సూర్యవంశీ సిక్సర్లు కొట్టడంపై మ్యాచ్ అనంతరం రబాడ స్పందించాడు. '11 ఏళ్లుగా బౌలింగ్ చేస్తున్నా. అదే విధానమే ఇప్పటికీ కొనసాగుతుంది. బౌలర్లు తమ ప్రణాళికలపై నమ్మకం ఉంచాలి. బ్యాటర్ల బలహీనతలపై విశ్లేషణ చేస్తాం. చాలా కష్టపడి సిద్ధమవుతాం. కానీ చివరికి అదే ప్రాసెస్‌ను కొనసాగించాలి' అని పేర్కొన్నాడు. శరీరం బాగానే ఉంది. కానీ మానసిక అలసట కూడా ఉంటుంది. అందుకే ప్రొఫెషనల్‌గా మరింత జాగ్రత్తగా ఉండాలి' అని తెలిపాడు.

## భువీ వికెట్ల వేట

ఐపీఎల్ 2026 సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు బౌలర్ భువనేశ్వర్ కుమార్ లేటు వయసులోనూ తన బౌలింగ్‌తో ఇరగదీస్తున్నాడు. ఆదివారం ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో ఈ వెటరన్ బౌలర్ నాలుగు వికెట్లు పడగొట్టి బౌలింగ్‌లో ఇంకా పదును తగ్గలేదని మరోసారి నిరూపించాడు. ఈ నేపథ్యంలో ఐపీఎల్ 19వ సీజన్‌లో 20 వికెట్లు పూర్తి చేసుకున్న భువనేశ్వర్ ఒక అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఒక ఐపీఎల్ సీజన్‌లో 20 వికెట్లు తీయడం భువనేశ్వర్‌కు ఇది నాలుగోసారి. తొలిసారి 2014లో 20 వికెట్ల మార్క్ దాటిన భువనేశ్వర్, ఆ తర్వాత 2016, 2017లోనూ ఈ ఫీట్ నమోదు చేశాడు. తాజాగా నాలుగోసారి 20 ప్లస్ వికెట్ల మార్క్‌ను అందుకున్నాడు. తద్వారా ఐపీఎల్‌లో ఈ ఘనత సాధించిన నాలుగో బౌలర్‌గా భువనేశ్వర్ నిలిచాడు. భువనేశ్వర్ కంటే ముందు యజ్వేంద్ర చాహల్ ఐదుసార్లు, లసిత్ మలింగ, జస్‌ప్రీత్ బుమ్రాలు నాలుగేసిసార్లు ఈ ఫీట్‌ను సాధించారు. ముంబైతో మ్యాచ్‌లో భువనేశ్వర్ తాను వేసిన తొలి రెండు ఓవర్లలోనే 17 పరుగులిచ్చి మూడు వికెట్లు తీశాడు. ఆ తర్వాత అర్ధసెంచరీతో ముంబై ఇన్నింగ్స్‌ను నిలబెట్టిన తిలక్ వర్మను క్లీన్‌బౌల్డ్ చేసి నాలుగో వికెట్ ఖాతాలో వేసుకున్నాడు.

## ఐపీఎల్‌లో పెద్ద వికెట్ వైభవే: మహ్మద్ కైఫ్

యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్‌లోనూ అదరగొడుతున్నాడు. 15 ఏళ్ల కుర్రాడి వికెట్ తీయడం కోసం ప్రపంచ మేటి బౌలర్లు తీవ్రంగా శ్రమిస్తున్నారు. వైభవ్ వికెట్ తీయగానే పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. గత మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్ జెమీసన్.. వైభవ్‌ను ఔట్ చేశాక అతిగా సెలబ్రేట్ చేసుకున్నాడు. అతడిపై బీసీసీఐ చర్యలు కూడా తీసుకుంది. తాజాగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ బౌలర్ సిరాజ్ కూడా వైభవ్ వికెట్ తీశాక గట్టిగా అరుస్తూ సంబరాలు చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ ఈ విషయంపై స్పందించాడు. 'అప్పుడు కేల్ జెమీసన్.. ఇప్పుడు మహ్మద్ సిరాజ్.. ఈ ఇద్దరూ ఎంతో అనుభవం ఉన్న పేసర్లు. ఇలాంటి ప్రపంచ మేటి బౌలర్లు వైభవ్ వికెట్ తీసిన తర్వాత అతిగా సంబరాలు చేసుకోవడం చూస్తుంటే.. ఐపీఎల్‌లో15 ఏళ్ల కుర్రాడు ఎంత పెద్ద వికెట్‌గా మారాడో అర్థమవుతోంది. ఇది వైభవ్ సూర్యవంశీ కష్టానికి, ప్రతిభకు దక్కిన గుర్తింపు' అని కైఫ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నాడు.







# ఉర్విల్ ఉరుములు

### సొంతగడ్డపై సీఎస్కే సూపర్ చేజింగ్.. బ్యాటింగ్‌లో ఉర్విల్ పటేల్ హీరోయిజం


**ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో భాగంగా చెన్నైలోని చెపాక్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై చెన్నై సూపర్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. పరుగుల వరద పారిన ఈ మ్యాచ్‌లో 204 పరుగుల భారీ లక్ష్యాన్ని చెన్నై జట్టు మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది.**

**టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన లక్నోకు ఓపెనర్ జోష్ ఇంగ్లిస్ (33 బంతుల్లో 85; 5 ఫోర్లు, 10 సిక్సర్లు) విధ్వంసకర ఆరంభాన్నిచ్చాడు. పవర్ ప్లేలోనే లక్నో స్కోరు 91 పరుగులకు చేరింది. అయితే ఇంగ్లిస్ ఔటైన తర్వాత లక్నో వరుసగా వికెట్లు కోల్పోయింది. చివర్లో షాబాజ్ అహ్మద్ (25 బంతుల్లో 43 నాటౌట్) రాణించడంతో లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగుల భారీ స్కోరు సాధించింది.**

చెన్నై బౌలర్లలో జేమీ ఓవర్టన్ 3 వికెట్లు పడగొట్టాడు. భారీ లక్ష్య ఛేదనలో చెన్నైకి శుభారంభం దక్కింది. సంజూ శాంసన్ (14 బంతుల్లో 28) మెరుపులు మెరిపించగా, అనంతరం క్రీజులోకి వచ్చిన ఉర్విల్ పటేల్ (23 బంతుల్లో 65; 2 ఫోర్లు, 8 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఐపీఎల్ రికార్డు సమం చేస్తూ, కేవలం 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (28 బంతుల్లో 42) అతనికి చక్కటి సహకారం అందించాడు. మధ్యలో కొన్ని వికెట్లు కోల్పోయి కాస్త తడబడినట్టు కనిపించినా, చివర్లో శివమ్ దూబే (7 బంతుల్లో 15), ప్రశాంత్ వీర్ (12 బంతుల్లో 17) ప్రశాంతంగా ఆడి జట్టుకు విజయాన్ని అందించారు.

### సంజూ సలహా కలిసొచ్చింది: గైక్వాడ్

చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా లక్నో జట్టుపై సీఎస్కే ఉత్కంఠభరిత విజయాన్ని నమోదు చేసింది. ఈ గెలుపు అనంతరం సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఎంతో సంతోషం వ్యక్తం చేశాడు. మ్యాచ్ అనంతరం జరిగిన ప్రెజెంటేషన్‌లో రుతురాజ్ గైక్వాడ్ మాట్లాడుతూ.. ఈ విజయం తమకు ఎంతో కీలకమని, పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మెరుగుపరుచుకోవడానికి ఇది బాగా ఉపయోగపడుతుందని పేర్కొన్నాడు. ప్లేయర్లందరూ సమిష్టిగా కృషి చేసి లక్ష్యాన్ని పూర్తి చేశారని, ముఖ్యంగా పవర్‌ప్లేలో తాము ఆశించిన దానికంటే మెరుగైన ప్రదర్శన కనబరిచామని, అదే గెలుపుకు బలమైన పునాది వేసిందని రుతురాజ్ గైక్వాడ్ ప్రశంసించాడు. ప్రత్యర్థి జట్టు బ్యాటర్ జోష్ ఇంగ్లిస్ ఆడిన విధ్వంసకర ఇన్నింగ్స్‌ను రుతురాజ్ మనస్ఫూర్తిగా అభినందించాడు. జోష్ ఇంగ్లిస్ అద్భుతమైన షాట్లతో విరుచుకుపడ్డాడని.. ఆ సమయంలో తమ బౌలర్ల వద్ద అతని దూకుడును అడ్డుకోవడానికి ఎటువంటి సమాధానం లేకపోయిందని నిజాయితీగా ఒప్పుకున్నాడు. అతని ఆట తీరు ఒక దశలో మ్యాచ్‌ను తమ నుంచి పూర్తిగా లాగేసుకునేలా కనిపించిందని, ఆ సమయంలో తమ వ్యూహాలు కూడా పని చేయలేదని రుతురాజ్ అభిప్రాయపడ్డాడు. మ్యాచ్ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు సంజూ శాంసన్‌తో జరిగిన చర్చను రుతురాజ్ గుర్తుచేసుకున్నాడు. "పవర్‌ప్లే ముగిసే సమయానికి లక్నో స్కోరు చూసి వాళ్లు చాలా ముందున్నారని మాకు అర్థమైంది. అప్పుడు సంజూ నాతో మాట్లాడుతూ.. మనం ఏదో ఒక మార్గాన్ని కనిపెట్టాలి, లేదంటే మ్యాచ్ చేజారిపోతుంది అని అన్నాడు" అని వివరించాడు. ఆ తర్వాత నూర్ అహ్మద్, జేమీ ఓవర్టన్ అద్భుతంగా బౌలింగ్ చేసి కీలక వికెట్లు తీయడంతోనే తాము తిరిగి పుంజుకున్నామని కొనియాడాడు. ఈ వికెట్‌పై 220 నుంచి 230 పరుగులు చేయడం కష్టమేమీ కాదని.. కానీ తమ బౌలర్లు వారిని 203 పరుగులకే కట్టడి చేయడం అభినందనీయమని అన్నాడు.



## ఫీల్డింగ్ వల్లే ఓడాం: పంత్

లక్నో కెప్టెన్ రిషబ్ పంత్ తన మనసులోని మాటను పంచుకున్నాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత రిషబ్ పంత్ మాట్లాడుతూ.. ఇదొక అద్భుతమైన మ్యాచ్ అని, రెండు జట్లు హోరాహోరీగా తలపడ్డాయని అభిప్రాయపడ్డాడు. చెన్నైలో మ్యాచ్ అంటేనే ఒత్తిడి ఉంటుందని మాకు తెలుసని.. దానికి తగ్గట్టుగానే సీఎస్కే తమపై తీవ్ర ఒత్తిడి పెంచిందని పంత్ పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌లో లక్నో ఓటమికి ప్రధాన కారణం ఫీల్డింగ్ అని రిషబ్ పంత్ బాహాటంగానే ఒప్పుకున్నాడు. టీ20 క్రికెట్‌లో ఫీల్డింగ్ ప్రమాణాలు అత్యున్నత స్థాయిలో ఉండాలని.. కానీ ఈరోజు తమ జట్టులో మరీ ఎక్కువగా క్యాచ్‌లు డ్రాప్ అయ్యాయని అసహనం వ్యక్తం చేశాడు. ఫీల్డింగ్ సరిగ్గా లేకపోతే భారీ లక్ష్యాన్ని కాపాడుకోవడం కష్టమని రిషబ్ పంత్ గుర్తుచేశాడు.

### ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| బెంగళూరు | 11 | 7 | 4 | 14 |
| హైదరాబాద్ | 11 | 7 | 4 | 14 |
| గుజరాత్ | 11 | 7 | 4 | 14 |
| పంజాబ్ | 10 | 6 | 3 | 13 |
| చెన్నై | 11 | 6 | 5 | 12 |
| రాజస్థాన్ | 11 | 6 | 5 | 12 |
| కోల్‌కతా | 10 | 4 | 6 | 9 |
| ఢిల్లీ | 11 | 4 | 7 | 8 |
| ముంబై | 11 | 3 | 8 | 6 |
| లక్నో | 11 | 3 | 8 | 6 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ-ఓడినవి పా-పాయింట్లు

## ముంబై, లక్నో ఎలిమినేట్

ఐపీఎల్ 2026 టోర్నమెంట్ నేపథ్యంలో ముంబైతో పాటు లక్నో సూపర్ జెయింట్స్ జట్టు కూడా ఎలిమినేట్ అయింది. 11 మ్యాచ్ లు ఆడిన ఇరు జట్లు.. కేవలం తలో మూడు విజయాలే నమోదు, మిగతా 8 మ్యాచెస్ లో ఓటమి పాలయ్యాయి. మధ్యాహ్నం తాడోపేడో తెల్చుకోవాల్సిన మ్యాచ్ లో సీఎస్కే చేతిలో ఓటమి పాలైంది లక్నో సూపర్ జెయింట్స్. ఆ తర్వాత ఆర్సీబీతో జరిగిన డూ ఆర్ డై మ్యాచ్ లో పరాజయం పాలైంది ముంబై ఇండియన్స్ జట్టు. ఇలా కీలక మ్యాచెస్ లో ఓటములు చవిచూడటంతో.. ప్లే ఆఫ్స్ నుంచి ముంబై, లక్నో రెండు టీంలు ఎలిమినేట్ అయ్యాయి. అటు ముంబైపై గెలుపుతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు పాయింట్ల పట్టికలో టాప్ లోకి వచ్చింది. హైదరాబాద్ రెండో స్థానానికి చేరుకుంది.





# ముంబై ఎలిమినేట్

### ప్లే ఆఫ్స్ రేస్ నుంచి అవుట్
### టాప్ లోకి ఆర్సీబీ
### కృనాల్ అద్భుత అర్ధశతకం

పంతొమ్మిదో సీజన్‌లో మరో ఉత్కంఠ పోరు అభిమానులను అలరించింది. లో స్కోరింగ్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై ఆర్సీబీని అదిరే విక్టరీ కొట్టింది. బ్యాటింగ్‌కు అనుకూలించని పిచ్ మీద టాపార్డర్ విఫలమైనా కృనాల్ పాండ్యా(73) ఒంటరి పోరాటంతో బెంగళూరును గట్టెక్కించాడు. కానీ, పట్టువదలని ముంబై బౌలర్లు డెత్ ఓవర్లలో పకడ్బందీగా బౌలింగ్ చేయడంతో చివరి ఓవర్ కీలకమైంది. భువనేశ్వర్(7 నాటౌట్) సిక్సర్ కొట్టగా.. చివరి బంతికి రసిక్ దార్ సలాం(3 నాటౌట్) రెండు పరుగులు తీయడంతో ముంబైకి ఓటమి తప్పలేదు. ప్లే ఆఫ్స్ రేసులో వెనకబడిన ఆర్సీబీ కీలక మ్యాచ్‌లో పంజా విసిరింది. రాయ్‌పూర్‌లో ముంబై ఇండియన్స్‌ను ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో చిత్తు చేసిన బెంగళూరు 14 పాయింట్లతో ముందంజ వేసింది. అయితే.. ఈ విజయం అంత తేలికగా ఏమీ రాలేదు. టాపార్డర్ విఫలమైనా.. కృనాల్ పాండ్యా(73) అద్భుత అర్ధశతకంతో గెలుపులో కీలక పాత్ర పోషించాడు. ముంబైని 166కే కట్టడి చేసిన ఆర్సీబీ ఇన్నింగ్స్ కూడా తడబడుతూనే సాగింది. విరాట్ కోహ్లీ(0) గోల్డెన్ డకవ్వగా.. ఇంప్యాక్ట్ సబ్ దేవ్‌దత్ పడిక్కల్(12)ను ఔట్ చేసి ఒత్తిడిలో పడేశాడు. బ్యాటింగ్‌కు ఏమాత్రం అనుకూలించని పిచ్ మీద అపసోపాలు పడిన జాకబ్ బెథెల్(27), కెప్టెన్ రజత్ పాటిదార్(8)లు ఆర్సీబీని ఆదుకోవాలనుకున్నారు. కానీ, పాటిదార్‌ను బాస్చ్ బోల్తా కొట్టించాడు. అనంతరం కృనాల్ పాండ్యా(73) జతగా సమయోచితంగా ఆడిన బెథెల్ స్కోర్ దాటించాడు. క్రీజునంటుకొని నాలుగో వికెట్‌కు 52 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని బాస్చ్ విడదీశాడు. జితేవ్ శర్మ(18) ధాటిగా ఆడే క్రమంలో ఔటవ్వగా డేంజరస్ టిమ్ డేవిడ్(0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. అంతే.. అప్పటిదాకా ఆర్సీబీ చేతుల్లో ఉన్న మ్యాచ్ కాస్త ముంబై వైపు మళ్లింది. ఓవైపు కండరాల నొప్పితో బాధ పడుతూనే గజన్‌ఫర్ వేసిన 18వ ఓవర్లో రెండు సిక్సర్లతో మళ్లీ బెంగళూరును పోటీలోకి తెచ్చాడు. కానీ, బుమ్రా మూడు రన్సే ఇవ్వగా చివరి ఓవర్లో 15 పరుగులు అవసరమయ్యాయి. రొమారియో షెపర్డ్() ఔటైనా.. భువనేశ్వర్(7 నాటౌట్) సిక్సర్‌తో ముంబై డీలా పడింది. చివరి బంతికి రసిక్ దార్ సలాం(3 నాటౌట్) రెండు పరుగులు తీయడంతో ఆర్సీబీ జయకేతనం ఎగురవేసింది. రాయ్‌పూర్‌లో ముంబై ఇండియన్స్ టాపార్డర్ కుప్పకూలినా తిలక్ వర్మ(57), నమ్‌ధిర్(47)లు ఆదుకున్నారు. ఈ సీజన్‌లో రెచ్చిపోతున్న ఆర్సీబీ పేసర్ భునేశ్వర్(4-23) ఎప్పటిలానే బ్రేకిచ్చాడు. ఓపెనర్ రికెల్టన్(2)ను ఔట్ చేసిన భువి.. అదే ఊపులో వరస బంతుల్లో రోహిత్ శర్మ(22), సూర్యకుమార్ యాదవ్(0)ను ఔట్ చేసి ముంబైని ఒత్తిడిలో పడేశాడు. తిలక్ వర్మ(57), నమన్ ధిర్(47)లు నిలబడ్డారు. కాస్త కుదురుకున్నాక బౌండరీలతో చెలరేగిన ఇద్దరు స్కోర్ బోర్డును ఉరికించారు. తిలక్ అర్ధ శతకంతో 12 ఓవర్లకే స్కోర్ వంద దాటింది. అయితే.. ఈ జోడీని విడదీసి ముంబైకి బ్రేకులు వేశాడు షెపర్డ్. విల్ జాక్స్(10), రాజ్ బవా(16)లు ధాటిగా ఆడలేకపోవడంతో ముంబై 166కే పరిమితమైంది.


నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# మీడియా మౌనం.. ప్రమాదకరం

ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా భావించే మీడియా బాధ్యత ఏమిటి? సమాజంలో అన్యాయం జరిగినప్పుడు బాధితుల పక్షాన నిలబడి గొంతుక వినిపించడం. కానీ, దురదృష్టవశాత్తూ నేడు తెలుగు మీడియా తీరు ప్రశ్నార్థకమవుతోంది. ముఖ్యంగా ఒక మైనర్ యువతికి అన్యాయం జరిగినప్పుడు, ఆ వార్తను ప్రజల్లోకి తీసుకెళ్లి వ్యవస్థను నిలదీయడంలో మీడియా చూపుతున్న నిర్లక్ష్యం అత్యంత ఆందోళనకరం. రాజకీయ వివాదాలకు, సెలబ్రిటీల వ్యక్తిగత విషయాలకు గంటల కొద్దీ సమయాన్ని కేటాయించే మీడియా సంస్థలు.. ఒక అబల ఆక్రందనను ఎందుకు వినలేకపోతున్నాయి? అన్యాయం జరిగిన బాధితురాలు సామాన్య కుటుంబానికి చెందిన వ్యక్తి కావడమే ఆమె చేసిన తప్పా? లేక నిందితులు సమాజంలో పలుకుబడి ఉన్నవారన్న భయమా? కారణం ఏదైనా కావచ్చు, కానీ ఒక మైనర్ ఎదుర్కొన్న అఘాయిత్యంపై మీడియా మౌనం వహించడం అంటే పరోక్షంగా అన్యాయాన్ని సమర్థించడమే అవుతుంది. సమాజంలో చైతన్యం తీసుకురావాల్సిన పత్రికలు, టీవీ ఛానెళ్లు కేవలం 'టీఆర్పీ' రేటింగుల వేటలో పడి నైతికతను విస్మరిస్తున్నాయి. మైనర్లకు రక్షణగా ఉండాల్సిన చట్టాలు, వ్యవస్థల వైఫల్యాలను ఎండగట్టాల్సిన బాధ్యత మీడియాపై ఉంది. ఒక చిన్నారి కన్నీటి కంటే రాజకీయ విమర్శలే ప్రాధాన్యత సంతరించుకోవడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు. వార్తలలో నిష్పాక్షికత ఉండాలి, కానీ బాధితుల విషయంలో కనీస సామాజిక స్పందన కరువవ్వడం విషాదకరం. ఇప్పటికైనా మీడియా తన వైఖరిని మార్చుకోవాలి. వార్తలను కేవలం వ్యాపార కోణంలోనే కాకుండా, సామాజిక బాధ్యతగా చూడాలి. ఒక మైనర్ యువతికి జరిగిన అన్యాయంపై మౌనాన్ని వీడి, గళం ఎత్తాలి. అప్పుడే ఈ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది. అన్యాయాన్ని ఎదిరించని మీడియా ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. నిశ్శబ్దం నేరస్తులకు బలం ఇస్తుంది, బాధితులకు కాదు.

# పద్మవ్యూహం.. యుద్ధ కళ

**పద్మవ్యూహం.. భారత యుద్ధ కళల్లో కీలకమైన స్ట్రాటెజీ. శత్రువును అన్ని వైపుల నుంచి చుట్టుముట్టి మట్టుపెట్టడంలో దీన్ని మించిన వ్యూహరచన మరొకటిలేదు. అయిదున్నర వేల సంవత్సరాల క్రితం నాటి మన ప్రాచీన యుద్ధకళ.. మహాభారత యుద్ధంలో ఇదొక కీలకఘట్టం. దీన్ని ఛేదించటంలో పాండవులు ఎందుకు విఫలమయ్యారు? అభిమన్యుడు ఒక్కడే లోపలికి ఎలా వెళ్లగలిగాడు? ఈ వ్యూహంలోని రహస్యం ఏమిటి?**



క్రీస్తు పూర్వం 3138, నవంబర్ 25.. మహాభారత యుద్ధంలో కీలక ఘట్టం చోటు చేసుకున్న సందర్భం అది. పద్మవ్యూహంతో కౌరవుల చెలగాటం పాండవులకు ప్రాణసంకటంగా మారిన సందర్భం.. అతిరథ మహారథులతో ఒకే ఒక్కడు.. అదీ బాలవీరుడు అయిన అభిమన్యుడు ఒంటరి యుద్ధం చేసిన రోజు.. ఒక పక్క పదులకొద్దీ అక్షౌహిణులు.. మరో పక్క ఒకే ఒక్క వీరుడు.. అబ్బురమైన సందర్భం. గురువు ద్రోణుడి వ్యూహాన్ని భేదించేందుకు పాండవుల వద్ద తెలివి చాలకపోయింది. బలం ఉన్నా.. వ్యూహ రహస్యం తెలియదు.. అది తెలియకపోతే.. ఎంతటి వీరుడైనా మట్టి కరవక తప్పని వ్యూహం.. ప్రత్యక్ష యుద్ధంలో ప్రత్యర్థిని మట్టుపెట్టడానికి అద్భుతమైన ఎత్తుగడ.. భారతీయ ప్రాచీన యుద్ధనీతుల్లో ప్రత్యర్థి పాలిటి అత్యంత ప్రమాదకరమైన ఎత్తుగడ.. ఇందులోకి ప్రవేశించటమే కష్టం.. ప్రవేశిస్తే బయటకు రావటం ఇంకా కష్టం. యోధానుయోధులను ఎదుర్కొంటూ వ్యూహాన్ని దెబ్బతీయటం అసంభవం.. అది పద్మవ్యూహం.. భారత యుద్ధాన్ని కీలక మలుపు తిప్పిన వ్యూహం.. ఒకే ఒక్క వీరుడు.. అదీ చిన్న పిల్లవాడు.. అభిమన్యుడు.. మహామహుల వ్యూహాన్ని దెబ్బతీసి లోపలికి వెళ్లాడు.. మధ్యలో చిక్కుకుపోయాడు.. ఒక్కడై.. ఒంటరై.. వీరమరణం పొందాడు. ఈ పద్మవ్యూహం నమూనా హిమాచల్ ప్రదేశ్లోని హమీర్ పూర్లోని రాజ్నూన్ గ్రామంలో కొండమీద రహస్యంగా ఒక రాతి శిల్పంపై బయటపడింది. వలయాలు వలయాలుగా అయోమయంగా గజిబిజి నిర్మాణంతో ఈ నమూనా ఉంది. దీని మొదలెక్కడో.. తుది ఎక్కడో అంత తేలిగ్గా అర్థమయ్యే వ్యవహారం కాదు. ఇది పాండవులు ప్రాక్టీసు కోసం ఏర్పాటు చేసుకున్న నమూనాగా చెప్పుకుంటారు. దీన్ని చూస్తేనే పద్మవ్యూహాన్ని భేదించటం ఎంత కష్టమో అర్థమవుతుంది. ఏడు వలయాలు.. ఏ వలయం నుంచి తేలిగ్గా లోపలికి వెళ్లాలో.. వలయాన్ని ఎంత ఒడుపుగా చీల్చుకుంటూ వెళ్లాలో ఈజీగా అర్థమయ్యేది కాదు. ఒక వలయంలో ఒక సైనికుడిని హతమారిస్తే.. సెకను వ్యవధిలో మరో సైనికుడు ఆ స్థానాన్ని భర్తీ చేస్తూ పోతుంటాడు.. ఇలాంటి వలయాన్ని ఛేదిస్తూ ముందుకు వెళ్లటానికి నైపుణ్యం కావాలి. ఇది చాలా రహస్యమైంది.. చాలా కొద్ది మందికి మాత్రమే దీని గురించి తెలుసు.. ఈ వ్యూహం తెలుసుకుంటే.. ఎలాంటి యుద్ధాన్నైనా జయించవచ్చంటే.. ఇది ఎంత ముఖ్యమైందో అర్థం చేసుకోవచ్చు. మహాభారత కాలంలో పద్మవ్యూహాన్ని రూపొందించిన ద్రోణాచార్యుడితో పాటు.. అర్జునుడు, శ్రీకృష్ణుడు, ఆయన కుమారుడు ప్రద్యుమ్నుడు, ప్రద్యుమ్న కుమారుడైన అనిరుద్ధుడికి మాత్రమే పద్మవ్యూహాన్ని ఛేదించటం తెలుసు. సుభద్రాకుమారుడైన అభిమన్యుడికి కొంతవరకు మాత్రమే తెలుసు. తల్లి గర్భంలో ఉన్నప్పుడే శ్రీకృష్ణుడు పద్మవ్యూహంలోకి ఎలా ప్రవేశించాలో సుభద్రకు చెప్తుండగా అభిమన్యుడు విని నేర్చుకున్నాడు. అదే ఆ పదమూడో రోజు పాండవులకు అక్కరకొచ్చింది. యుద్ధంలో ఏదో ఒక రోజు పద్మవ్యూహాన్ని ఛేదించాల్సి వస్తుందని పాండవులకు ముందే తెలుసు. దీనికోసం వాళ్లు చాలా కసరత్తే చేశారు. అందులో భాగమే ఈ నమూనా. అర్జునుడు మినహా మిగతా పాండవులంతా ఈ నమూనాను ముందుంచుకుని ఇందులోకి ఎలా ప్రవేశించాలో.. ఎలా బయటకు రావాలో చాలా ప్రాక్టీస్ చేశారు.. ఈ వలయాల్లోకి ఒక వైపు నీళ్లు పోసి ఆ నీళ్లు పారుతూ.. ఎటువైపు నుంచి బయటకు వస్తాయో చూస్తూ వ్యూహ భేదనను తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఒక దగ్గర నీరు పోయటం.. దాని ప్రవాహపు తీరును గమనించటం నెలల తరబడి చేశారు. కానీ, చివరకు అసలు వ్యూహం దగ్గరకు వచ్చేసరికి నలుగురు దిగ్గజాలూ చేతులెత్తేశారు.

యుద్ధం మొదలైన 13వ రోజున అంటే క్రీస్తుపూర్వం 3138 నవంబర్ 25వ తేదీన ద్రోణుడి చేత పద్మవ్యూహాన్ని పన్నేలా చేశాడు దుర్యోధనుడు. దీని రహస్యం తెలిసిన అర్జునుడిని, కృష్ణుడిని సుశర్మ రెచ్చగొట్టి యుద్ధభూమికి దూరంగా తీసుకుపోయాడు. ఆ తరువాత పద్మవ్యూహాన్ని చీల్చే మొనగాడే పాండవ సైన్యంలో లేకుండా పోయాడు. అప్పుడు ధర్మరాజుకు మిగిలిన ఒకే ఒక ఆప్షన్ అభిమన్యుడు. అతని వయసు అప్పటికి 32 సంవత్సరాలే.. పెళ్లయి ఆరు నెలలు కూడా కాలేదు.. అతని భార్య ఉత్తర గర్భవతిగా వుంది. ఆ సమయంలో అభిమన్యుడు రంగంలోకి దిగక తప్పలేదు. అభిమన్యుడికి పద్మవ్యూహం గురించి కొద్దిగా మాత్రమే తెలుసు.. ఆ కాస్త పని కానిస్తే తామంతా అతని వెనువెంటే వ్యూహంలోకి చొచ్చుకుపోవచ్చని ధర్మరాజు తలచాడు. అభిమన్యుడికి అంతా ధైర్యం చెప్పి పంపించారు. పద్మవ్యూహం తొలి వలయం ముందు సైంధవుడు కాపలా వున్నాడు. ఆ వలయాన్ని నేరుగా చీల్చటం సాధ్యం కాని పని.. వలయాన్ని తన కుడివైపునకు ఏటవాలుగా చీల్చుకుంటూ అభిమన్యుడు లోపలికి వెళ్లిపోయాడు. అతను చేసిన ఖాళీని మిగతా కౌరవ సైన్యం అతి వేగంగా భర్తీ చేసుకుంటూ పోయింది. అభిమన్యుడి వెన్నంటి ఉండేందుకు మిగతా పాండవులకు అవకాశమే లేకుండా పోయింది. పద్మవ్యూహం మొత్తం ఏడు వలయాలుగా ఏర్పడుతుంది. ఒక్కో వలయాన్ని ఒక్కో విధంగా ఏర్పాటు చేస్తారు. తొలి వలయాన్ని ఛేదించినట్లే ఆరు వలయాలను చెల్లా చెదరు చేసుకుంటూ ఏడో వలయం దగ్గరకు వచ్చాడు.. అక్కడ అతని ప్రయాణం ఆగిపోయింది. అప్పటి వరకు ఉన్న కౌరవ సైన్యం వేరు.. ఏడో వలయం దగ్గరున్న అతిరథ సేనావాహిని వేరు.. ఏడో వలయం దాటితే దుర్యోధనుడిని బంధించే అవకాశం అభిమన్యుడికి చిక్కేది.. కానీ, ఏడో వలయాన్ని ఛేదించటం అతని వల్ల కాలేదు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు, అంతా కలిసి ఒక్కసారిగా.. శకుని, శల్యుడు, కర్ణుడు, దుశ్శాసనుడు, కృతవర్మ, అశ్వత్థామ ఒక్కుమ్మడిగా అభిమన్యుడిపై అన్ని వైపుల నుంచి దాడి చేశారు.. అప్పటి యుద్ధ నియమాల ప్రకారం ఒక వీరుడితో ఒక్కరు మాత్రమే పోరాడాలి.. కానీ, అభిమన్యుడిని అన్ని వైపుల నుంచి చుట్టుముట్టి నిరాయుధుణ్ణి చేసి హతమార్చారు. అతను చనిపోయిన రోజు మార్గశిర కృష్ణ దశమి. అంతకు ముందు జ్యేష్టమాసంలోనే ఉత్తర గోగ్రహణం తరువాత అభిమన్యుడి వివాహం జరిగింది. ఆరునెలల మ్యారేజి లైఫ్ కూడా గడపకుండానే అతను నేలకొరిగాడు. కురుక్షేత్రంలో మహామారణకాండ జ్ఞాపకాలు ఇంకా కనిపిస్తున్నాయి. ఇదిగో ఇక్కడ ఈ పద్మవ్యూహ నమూనా మన రణనీతికి నిలువుటద్దమైంది. కానీ, దీని ఆలనాపాలనా చూసే వాళ్లే కరవయ్యారు. ఈ నమూనా.. హమీర్పూర్లోని రాజ్నూన్ దగ్గర ఉంది. కానీ దీని దగ్గరకు ఎలా వెళ్లాలో మీకు తెలుసా? మీకే కాదు.. ఈ నమూనా ఉన్న జిల్లా అధికారులకు సైతం తెలియనంత అటవీప్రాంతంలో ఉంది.. ఎప్పుడో అరణ్యవాస కాలంలో అంటే క్రీస్తు పూర్వం 3150లో ఈ నమూనాను పాండవులు రూపొందించుకుని ప్రాక్టీస్ చేసినట్లు కార్బన్ డేటింగ్ వల్ల తెలుస్తున్నది. ఎక్కడో మారుమూల అటవీ ప్రాంతంలో.. కొండ గుట్టల నడుమ దారీ తెన్నూ లేని చోట అనాధగా పడి ఉంది. కనీసం దీనికి దారి కూడా లేకుండా పోయింది. అధికారుల్ని అడిగితే.. అదో రాయి మాత్రమే అని.. దానికి చారిత్రక ప్రాధాన్యం లేనే లేదని కొట్టి పారేస్తారు.. చెట్టూ పుట్టల మధ్య భారత రణతంత్రానికి ఈ పద్మవ్యూహ నమూనా ఒక్కటే ఆధారం. ఆనాడు మన యుద్ధ నీతులు ఎలా ఉండేవి.. ప్రత్యక్ష యుద్ధంలో శత్రువును అణచివేసేందుకు.. బంధించేందుకు ఎలాంటి వ్యూహాలు ఉండేవనటానికి ఈ నమూనా కీలకం.. ప్రాచీన యుద్ధ నీతుల గురించి నేటి తరానికి చెప్పటానికైనా.. చూపించటానికైనా మిగిలిన ఒకే ఒక్కటి ఈ నమూనా.. పద్మవ్యూహం నమూనా. ఒకటి కాదు.. రెండు కాదు.. అయిదున్నర వేల సంవత్సరాల నాటి చరిత్ర.. ఆఫ్గనిస్తాన్ నుంచి మధ్యభారతం దాకా మహాభారత కాలం నాటి గుర్తులు బయటపడ్డాయి. హస్తినాపురం ఎక్కడుందో.. ఎలా ఉందో.. అది ఎలా శిథిలమైపోయిందో.. బ్రిటిష్ వాళ్లు వెలికి తీసి చెప్పేదాకా మనకు తెలియలేదు.. కనీసం ఆ తరువాతైనా దాన్ని జాతి సంపదగా కాపాడుకునే ప్రయత్నం జరిగిందా అంటే అదీ లేదు.


కోవెల సంతోష్ కుమార్
రచయిత, 9052116463

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.